J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 5 7.7.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## కేంద్రంలో కమలానికి...

# కూటమితో ఓటమి తప్పదా?







### మోడీ హీరో అవుతాడా.. జీరో అవుతాడా?

### కూటమి రాజకీయాలు బీజేపీకి బ్రేకులు వేస్తాయా?

### మోడీ - షా ద్వయాన్ని 15 పార్టీల కూటమి ఢీకొట్టగలదా?

### ప్రతిపక్షాల ఐక్యతను బీజేపి విచ్ఛిన్నం చేయగలదా?

### తెలుగు రాష్ట్రాల అధ్యక్షుల మార్పు వెనుక మర్మం ఏమిటి?

బీజేపీని గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా ఏర్పాటైన 15 పార్టీల కూటమి విజయం సాధించగలదా? 9 ఏళ్ల నుంచి ఎదురులేకుండా దూసుకుపోతున్న బీజేపీకి బ్రేకులు వేయగలదా? ఒక దశలో దేశంలోని 19 రాష్ట్రాల్లో అధికారం చేజిక్కించుకున్న కాషాయపార్టీ కూకటివేళ్లను ఈ కూటమి పెకలించగలదా? 9 ఏళ్ల నుంచి ఎత్తులకుపైఎత్తులు వేస్తూ ప్రాంతీయపార్టీలను, కాంగ్రెస్‌ను ముప్పతిప్పలు పెడుతున్న బీజేపీని లొంగదీసే సత్తా ఈ కూటమికి ఉందా? ఎన్నికలు సమీపిస్తున్న వేళ రెండు తెలుగురాష్ట్రాల అధ్యక్షుల మార్పు వెనుక మర్మం ఏమిటి..? ఇలాంటి అనేక ప్రశ్నలు ఇప్పుడు దేశ రాష్ట్ర రాజకీయాలలో చక్కర్లు కొడుతున్నాయి.

2019 సార్వత్రిక ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీకి వచ్చిన లోక్‌సభ సీట్లు 303, వచ్చిన ఓట్లు 37.36 శాతం. అంటే దేశంలో...

10లో

N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
(AUTONOMOUS)
Estd:1979
Affiliated to JNTUA, Ananthapuramu
Vidyanagar, Tirupati Dt. Phone : 8985382247, www.nbkrist.org

OUR CREDENTIALS

EAPCET CODE NBKR

- Courses accredited by NBA under tier - 1
- Accredited by NAAC with 'A' grade
- Accorded 'A' grade by Government of AP
- College with Potential for Excellence
- Robotics Research & Training Center
- ICT ACADEMY Premier Member
- TCS Accredited Institution
- SAEINDIA Collegiate Club
- CYIENT Empaneled Institution
- MEIDEN Japanese Skill Transfer Programme

Courses Offered: B.Tech.
•CSE •CSE (AI & ML)
•CSE (DS) •AI & DS •IT
•ECE •EEE
•MECHANICAL •CIVIL

COLLEGE BUS FACILITY FROM
Nellore | Gudur | Naidupeta | Sullurupeta | Tada | Venkatagiri
Muthukuru | Mallam | Podalakuru | Rapuru, Sydapuram & Srikalahasti

• Year-wise separate hostel facility for boys
• Well - protected enclosed hostel for girls

N.C.C.
ARMY WING
NAVAL WING



NEDURUMALLI RAMKUMAR
CORRESPONDENT

# అబ్దుల్ అజీజ్‌తో.. నారాయణ భేటీ



మాజీమంత్రి, టిడిపి నగర నియోజకవర్గ ఇన్ చార్జిగా నియమితులైన డాక్టర్ పొంగూరు నారాయణ ఇటీవల టిడిపి నేత అబ్దుల్ అజీజ్‌ను ఆయన నివాసానికి వెళ్ళి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. లోకేశ్ యువగళం పాదయాత్ర గురించి, జిల్లాలో రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు వగైరా అంశాలపై వారు చర్చించుకున్నారు. అజీజ్ సోదరుడు అబ్దుల్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్నవాడ క్షేత్రంలో అన్నదానానికి రూ.50 వేల విరాళం



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదాన సదనానికి బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన దాతలు గుబ్బా వెంకటేశ్వర్లు, వారి కుటుంబసభ్యులు ఇటీవల 50,116 రూపాయలను తమ వితరణగా సమర్పించుకున్నారు. ఆలయ నిర్వాహకులకు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు అమ్మవారి వద్ద పూజలు చేయించి ఆశీర్వదించారు.

# సమస్యల సాధనకు.. బీసీలు సంఘటితం కావాలి

## రాష్ట్ర నాయకుడు బీసీ రమణ పిలుపు

రాష్ట్రంలోని బీసీ (వెనుకబడిన కులాల వారు)లంతా సమస్యల సాధనకు సంఘటితం కావాలని బీసీ చైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీసీ రమణ పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే-సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాల వద్ద బీసీల సంఘం తరపున పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. తరాలు మారుతున్నా బీసీల తలరాతల్లో మార్పు ఉండడం లేదని, ఏళ్లు గడిచిపోతున్నా బీసీల కష్టాలు తీరడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రధానంగా బీసీల కుల గణన, బీసీలకు రాజకీయ ప్రాధాన్యత, విద్య-ఉద్యోగం-ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కావాలని ఎంతోకాలంగా కోరుకుంటున్నా ఆ కలలు నెరవేరడం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, ఏపీ బీసీ చైతన్యసమితి ప్రచార కార్యదర్శి ఆరంబాక్కం చంద్రశేఖర్‌లతోపాటు నాయకులు వెంకటసుబ్బయ్య, దేవళ్ళ అంకయ్య, చల్లా జయకర్, నాగేశ్వరరావు, ఆనందయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, తన్నీరు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రూ. 79.80 లక్షల పంటలబీమా విడుదల

జిల్లాలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నాలుగు మండలాల్లోని 127 మంది రైతులకు డా.వైఎస్ఆర్ ఉచిత బీమా పథకం కింద 79,80,386 రూపాయలు విడుదలయ్యాయని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్‌రాజు తెలిపారు. వరి, వేరుశనగ పంటలు సాగుచేసిన జలదంకి, ముత్తుకూరు, ఉదయగిరి, దుత్తలూరు మండలాలకు చెందిన ఆయా రైతులకు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలలో ఆ నగదు జమ చేయడం జరిగిందని, లబ్ధిదారుల జాబితాలను ఆ మండలాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ప్రకటించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

## పర్యాటకశాఖాధికారిగా..

# సాయికృష్ణ



జిల్లా రెవిన్యూ శాఖలో డెప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తూ, ఇటీవలే తహశీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందిన సాయికృష్ణ తాజాగా జిల్లా పర్యాటక, సాంస్కృతికశాఖ అధికారిగా నియమితులయ్యారు.

## ఆగస్టు 31వరకు

# చేపలవేట నిషేధం

జిల్లాలోని జలాశయాల్లో మత్స్యసంపదను అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా చేపలవేటను జులై 1 నుంచి ఆగస్టు 31వ తేది వరకు నిషేధిస్తున్నామని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. సంతానోత్పత్తి కాలంలో తల్లిచేపలు, రొయ్యలను సంరక్షించేందుకు, తద్వారా జలాశయాల్లో మత్స్యసంపదను వృద్ధి చేసేందుకు రెండు నెలల పాటు నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# మరో భక్తిపుష్పం... 'శ్రీ వెంగమాంబ మహాత్మ్యం'

భారతీయ సంస్కృతీ సమారాధనలో ప్రతి ఇంట, ప్రతి గ్రామంలో దేవతారాధన జరుగుతూ ఉంటుంది. గ్రామదేవతలకు ఎంతో వైభవంగా తిరునాళ్ళ పేరిట ఉత్సవాలు చేసి మొక్కుబడులు తీర్చుకుంటూ ఉంటారు. ఇది ప్రాచీన కాలం నుంచి మనదేశంలో వస్తున్న సంప్రదాయం. అందులోనూ నెల్లూరు జిల్లా ఒక గొప్ప ఆధ్యాత్మిక నిలయం. నెల్లూరు నగరంలోనే కాక జిల్లావ్యాప్తంగా అనేక పుణ్యక్షేత్రాలున్నాయి. వీటిలో నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవాలయం ఒకటి. ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన గ్రామదేవత నిలయం. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో వెలసి, రాష్ట్రవ్యాప్తంగానే కాక దేశవిదేశాల్లోని భక్తులకు కూడా ఆరాధ్య దేవతగా ప్రఖ్యాతిచెందిన ఈ ఆలయం ఎంతో విశిష్టమైనది. వెంగమాంబ అమ్మవారు అఖండ మహిమాన్విత శక్తి. తనను నమ్ముకున్న భక్తుల కష్టాలు తీర్చి, కోరికలు నెరవేర్చే వారి జీవితాలను సుఖప్రదం, శుభప్రదం చేసే మహాశక్తి స్వరూపిణి. ఆ అమ్మను తలచుకుంటే చాలు..అన్ని బాధలు ఇట్టే తీరిపోతాయి. అంతటి ప్రఖ్యాతమైన అమ్మవారి చరిత్రను అమ్మవారి భక్తుడు, ఆధ్యాత్మికచింతనాపరుడు, ప్రముఖ రచయిత, పత్రికా రంగంలో పనిచేస్తున్న డాక్టర్ కనియంపాటి రామకృష్ణ ఒక చిన్న గ్రంథంగా రూపుదిద్ది, అమ్మవారికి ఓ భక్తిపుష్పంగా సమర్పించి తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారు. సహజకవి మల్లెమాల జీవితం-కవిత్వంపై పరిశోధనచేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఎంఫిల్ పట్టా పొందిన ఈ రచయిత సహజంగానే పరిశోధనాసక్తి కలవారు కావడంతో ఈ గ్రంథానికి మరింత సుగంధం అబ్బింది.

'భక్తుల పాలిట కల్పవృక్షం.. శ్రీ వెంగమాంబ మహాత్మ్యం' అనే పేరిట ఆయన వెలువరించిన ఆ గ్రంథం, వెంగమాంబ అమ్మవారి ముఖచిత్రంతో, ఇరవై పేజీల ఉపోద్ఘాతం, 106 పేజీల విషయవిశ్లేషణతో, అందమైన వర్ణచిత్రాలతో ఎంతో ఆకర్షణీయంగా, ఆసక్తిజనకంగా ఉంది. దేవాలయ పరిసరాలను స్థలచరిత్రను అమ్మవారి మహిమలను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. ఈ గ్రంథంలోని అంశాలను మూడు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో 'నర్రవాడ- వెంగమాంబ నామౌచిత్యం, పుట్టుక' అనే విషయవివరణ ఉంది. రెండవ భాగంలో తిరునాళ్ళు రకాలు అనే విషయం చక్కగా విశ్లేషింపబడింది. తిరునాళ్ళలో ప్రదర్శించే తోలుబొమ్మలాటలు, చెక్కభజనలు లాంటి కళారూపాల ప్రదర్శనలు ఛాయాచిత్రాలతో సహా ముద్రించారు. 2014లో తొలి ముద్రణ జరిగిన ఈ గ్రంథం అచిరకాలంలోనే భక్తులను బాగా ఆకట్టుకుని, మూడు ముద్రణలు పూర్తి చేసుకుని, ఇటీవలే నాల్గవ ముద్రణ కూడా జరిగి ఆ పుస్తకానికి అమ్మవారి దేవాలయంలో ఆవిష్కరణ జరగడం విశేషం. అమ్మవారి దేవస్థానాన్ని, అక్కడ ప్రతియేటా జరిగే తిరునాళ్ళ వైభవాన్ని, అత్యంత ఉత్సాహంగా జరిగే కళా ప్రదర్శనలు తిలకించి పులకించి ఆ విశేషాలన్నిటినీ ఏర్చికూర్చి ఒక అద్భుతమైన మాలగా రూపొందించి భక్తులకు ఒక చిరుకానుకగా సమర్పించారు. జానపద కళారూపాలైన బుర్రకథ, భజనలు, కోలాటాలు, కీలుగుర్రాలు, పౌరాణిక నాటకాల వంటి ప్రదర్శనలు కూడా ఈ తిరునాళ్లలో ఎంత గొప్పగా జరుగుతాయో సవివరంగా పొందుపర్చారు. చివరికి అంగళ్ళలో అమ్మే పరికరాలను, వివిధ రకాల తినుబండారాల విశేషాలను కూడా పేర్కొనడం ఈ రచయిత నిశిత పరిశీలనకు నిదర్శనం. కళరూప ప్రదర్శనలో పాడే జానపద గేయాలను కూడా వీరు ఉదహరించారు. అటు నర్రవాడ గ్రామానికి, ఇటు అమ్మవారి దేవాలయానికి నాటి నుంచి ఉన్న ప్రాశస్త్యాన్నంతా శోధించి వెలువరించిన ఆ పరిశోధనా గ్రంథంలో అమ్మవారి ఆవిర్భావ చరిత్రను, మహిమాన్వితమైన అమ్మవారి వైశిష్ట్యాన్ని అందరికీ సుబోధకం చేశారు.

ఈ ఆధ్యాత్మిక పరిశోధనా గ్రంథం అందరూ తప్పక చదువవలసినది. శ్రీ వెంగమాంబ అమ్మవారి భక్తులకు ఇదొక కరదీపిక వంటిది. ఈ గ్రంథం చదివితే చాలు.. అమ్మవారి తిరునాళ్ళ వైభవం, వెంగమాంబ అమ్మవారి మహిమ మనోగతమై అమ్మవారిని స్వయంగా దర్శించిన అనుభూతిని పొందగలరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇంత మంచి ఆధ్యాత్మిక గ్రంథం రచించిన రచయిత ధన్యులు.






**శ్రీ వెంగమాంబ మహాత్మ్యం**
రచయిత:
డా॥ కనియంపాటి రామకృష్ణ
పేజీలు: 106 వెల. 100/-
ప్రతులకు:
శ్రీ రామకృష్ణ సేవాసమితి
బి.వి.నగర్, నెల్లూరు - 524 004.
మొబైల్: 7981983504.



**విద్వాన్ డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు**
ఫోన్: 9908855294

## శ్రామికనగర్ స్కూల్‌లో..

# ఉచితంగా ట్యూషన్

నెల్లూరురూరల్ పరిధిలోని కొత్తూరులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌలభ్యం కోసం విఆర్‌ఓ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ఇటీవల ప్రారంభించారు. పాఠశాల ముగిశాక సాయంత్రం వేళ స్కూల్‌లోనే ట్యూషన్‌ను ఉచితంగా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, రమణమ్మతో పాటు విఆర్‌ఓ సంస్థ ప్రతినిధి ఆంజనేయులు, ట్యూటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్లలో

# సబ్సిడీ టమాటోలు

టమాటా ధరలు కిలో 110 రూపాయల దాకా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న నేపథ్యంలో ప్రజలకు అవి అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కిలో 50 రూపాయలకే అందజేస్తోంది. నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేట, నవాబుపేట రైతు బజార్లలోను, కావలి-కందుకూరుల్లో ఉన్న రైతు బజార్లలోనూ సబ్సిడీ ధరలకే టమాటోలు విక్రయిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనిత తెలిపారు.

# నేత్రపర్వం.. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



నెల్లూరు రూరల్ మండలంలోని వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇటీవల స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయంలోని కల్యాణమండపంలో స్వామివారిని, అమ్మవార్లను కొలువుదీర్చి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణం నిర్వహించారు. అనంతరం గజవాహనంపై పెద్దఎత్తున ఊరేగింపు జరిగింది. ఉభయకర్తలుగా వల్లూరు శ్రీధర్‌రెడ్డి, అనూరాధ, దువ్వూరు వెంకటేష్‌రెడ్డి, పద్మావతి, రామ్‌శరణ్‌రెడ్డి, కావ్య, దువ్వూరు కార్తీక్‌శరణ్‌రెడ్డి, ప్రీతిక, దుగ్గిశెట్టి కోటేశ్వరరావు, సునీత, శ్రీధర్, తనూజ తదితరులు వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# కోళ్ళ వ్యర్థాలతో పెరిగే చేపలు.. అనారోగ్యకరం

చేపలు త్వరగా పెరుగుతాయని కోళ్ళ వ్యర్థాలతో వాటిని పెంచడం మంచిపద్ధతి కాదని, చేపలు సహజంగానే పెరగాలి తప్ప అసహజమైన ప్రక్రియలతో పెంచరాదని, అలాంటి చేపలను తింటే ఆరోగ్యానికి హానికరమని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు చేపల గుంటల సాగుదార్లను హెచ్చరించారు. ప్రధానంగా బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, సంగం మండలాల్లో అలా అసహజంగా చేపలు పెంచుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఏడెనిమిది నెలలపాటు చేపల పెంపకం జరగాల్సి ఉండగా కోళ్ల వ్యర్థాలు వాటికి మేతగా వేసి కేవలం నాలుగు నెలల్లోనే చేతికివస్తాయని సాగుదార్లు ఇలాంటి అనైతిక విధానాలకు పాల్పడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ ప్రక్రియను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కోళ్ళ వ్యర్థాలను సరఫరా చేసే వాహనాలను పట్టుకోవడం, కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# తెలుగు వైభవాన్ని, వైభోగాన్ని...

# ప్రతిబింబింపచేసిన 'నాటా' సంబరాలు

అమెరికాలో అయిదేళ్ల తరువాత నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) అయిదవ ద్వైవార్షిక సమావేశాలు జరిగాయి. టెక్సాస్ రాష్ట్రం, డల్లాస్ నగరంలోని డల్లాస్ కన్వెన్షన్ సెంటర్ ఈ సంబరాలకు వేదికయ్యింది. సంస్థ అధ్యక్షుడు కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి డల్లాస్ నగర నివాసి కావడం, ఆయన అధ్యక్షతన ఈ వేడుకలు డల్లాస్ నగరంలో జరగడంతో ఈ సంరంభాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

జూన్ 30వ తేదీ శుక్రవారం సాయంత్రం జరిగిన బాంక్వెట్ మరియు డిన్నర్ నుండే అతిథుల సంఖ్య భారీగా కనిపించింది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్న నిష్ణాతులకు అవార్డులను అందజేశారు. అనంతరం సుప్రసిద్ధ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ సంగీత కార్యక్రమం వేడుకలలో ఉత్సాహాన్ని నింపింది.

## ○ 'నాటా జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్న డాక్టర్ ప్రేమ్‌రెడ్డి




యువతనుద్దేశించి మాట్లాడుతూ జీవితంలో లక్ష్యంతో శ్రమించి తపిస్తే సాధించలేనిదేది లేదని అంటూ.. స్ఫూర్తిదాయక మాటలతో వారిలో ఉత్సాహాన్ని నింపారు.

అనంతరం ప్రఖ్యాత సంగీత దర్శకుడు, గాయకుడు, నటుడు దేవిశ్రీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమం వేడుకలలో జోష్ నింపింది.

ఈ మూడురోజుల సంబరాలలో తొలి రోజు 5 వేలమంది తెలుగువారు పాల్గొనగా మిగిలిన రెండు రోజులూ ఒక్కొక్క రోజు 15వేలమంది పాల్గొని కార్యక్రమాలకు తెలుగు వెలుగులు తెచ్చారు. తెలుగు వైభవాన్ని, వైభోగాన్ని ప్రతిబింబింపచేసే విధంగా అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలను, కళా రూపాలను, సాహిత్య సదస్సులను నిర్వహించి తెలుగుజాతి ఖ్యాతిని అమెరికా దేశంలో చాటడంలో నిర్వాహకుల కృషి అభినందనీయం.



చివరిరోజు జులై 2న తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో జరిగిన శ్రీనివాస కళ్యాణంతో కార్యక్రమాలు మొదలయ్యాయి. ఈ కళ్యాణ వేడుకలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఇదేరోజు డాక్టర్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని కూడా అమెరికాలోని వైఎస్సార్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. పలువురు వైసీపీ నాయకులు ఈ జయంతిలో పాల్గొని మహానేతను స్మరించుకున్నారు. అదేరోజు సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలో కూడా పలువురు సినీ ప్రముఖులు, రాజకీయనేతలు పాల్గొన్నారు. తన అధ్యక్షతన 5వ ద్వైవార్షిక సభలను విజయవంతంగా నిర్వహించినందుకు కొర్సపాటి శ్రీధర్‌రెడ్డిని డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్వ అధ్యక్షుడు గోసల రాఘవరెడ్డి ఇతర కార్యవర్గసభ్యులు ఘనంగా సత్కరించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నాటా అధ్యక్షుడిగా ఈ రెండేళ్ల కాలంలో తాను ఎన్నో నేర్చుకున్నానని అన్నారు. తనకు అండగా ఉండి కార్యక్రమ విజయానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత డిసెంబర్ 26న నెల్లూరులో జరిగిన నాటా సేవాడేస్‌లో డాక్టర్ ప్రేమ్‌రెడ్డి అభినందన కార్యక్రమానికి సారథ్యం వహించిన రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, వారి సతీమణి ప్రశాంతిరెడ్డిని నాటా పక్షాన డాక్టర్ ప్రేమ్‌రెడ్డి అభినందించి సత్కరించారు.




జులై 1వతేది ఉదయం పూజా కార్యక్రమంతో రెండవ రోజు వేడుకలు మొదలయ్యాయి. ఉదయం నుండి రాత్రి వరకూ వివిధ విభాగాల సభలు, సమావేశాలు, సెమినార్‌లు జరిగాయి. తెలుగు రాష్ట్రాలలోని పలు విశ్వవిద్యాలయాలలో చదువుకున్న పూర్వ విద్యార్థినీ విద్యార్థులు కలుసుకుని పాత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనేక సాహిత్య, సాంస్కృతిక, కళ, రాజకీయ, ఆరోగ్య, విద్య, వ్యాపార రంగాలతో పాటు ఇతర అనేక విభాగాలకు చెందిన ప్రముఖులు జులై 1, 2వ తారీఖులలో జరిగిన సదస్సులలో పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య విభాగ సదస్సులో దక్షిణ తూర్పు ఆసియాలో అకస్మాత్తుగా వస్తున్న గుండెపోట్లు, వాటి నివారణ కోసం ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రముఖ గుండెవైద్య నిపుణులు, మన నెల్లూరీయులు, ఫ్లోరిడా రాష్ట్రం, టాంపా నివాసి డాక్టర్ కేశవరామిరెడ్డి ప్రసంగించారు. వైద్య రంగంలో సంతరించుకుంటున్న విప్లవాత్మక మార్పులు, అందుబాటులోకి వస్తున్న ఆధునిక వైద్యం తదితర అంశాలపై మరో నెల్లూరీయులు, అమెరికాలోని తెలుగువారి ఆపద్భంధువు డాక్టర్ ప్రేమ్‌రెడ్డి ఉపన్యసించారు. 1వతేది రాత్రి జరిగిన ప్రముఖ యువ సంగీత దర్శకుడు, మన నెల్లూరీయుడు తమన్ పాటల సందడి ఆనాటి కార్యక్రమాల్లో హైలైట్‌గా నిలిచింది.

### జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న ప్రేమ్‌రెడ్డి

చివరి రోజు కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌రెడ్డి అందిస్తున్న సామాజిక సేవలకు గుర్తుగా ఆయనని నాటా 'జీవిత సాఫల్య పురస్కారం'తో గౌరవించింది. తనకు ఇచ్చిన పురస్కారానికి స్పందిస్తూ తన జీవిత ప్రస్థానాన్ని, చిన్నతనంలో తాను పడిన శ్రమను, కష్టపడి శ్రమించి తాను సాధించిన విజయాన్ని సభికులకు వివరించారు. ముఖ్యంగా

### నాటా అవార్డు అందుకున్న నెల్లూరీయుడు వైరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్....

నెల్లూరుజిల్లాకి చెందిన ప్రముఖ వైరాలజిస్టు డాక్టర్ వెంకటేష్‌ని నాటా బాంక్వెట్ కార్యక్రమం సందర్భంగా అవార్డుతో సత్కరించింది. నెల్లూరుజిల్లా ఉదయగిరి దగ్గర బెడుసుపల్లి అనే ఒక చిన్న గ్రామంలో, ఒక పేద రైతు కుటుంబంలో జన్మించారు డాక్టర్ వెంకటేష్. ఎంతో కష్టపడి పైచదువులు చదువుకొని పుణెలోని నేషనల్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీలో కొన్ని సంవత్సరాలు పనిచేశారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని ఒక ప్రఖ్యాత పరిశోధనా సంస్థలో వైరాలజిస్టుగా పనిచేస్తున్నారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న తరుణంలో పలు టీవీ ఛానెళ్ల ఇంటర్వ్యూల ద్వారా ప్రజలలో చైతన్యం కల్పించి భరోసా కల్పించడంలో కీలకపాత్ర పోషించి డాక్టర్ వెంకటేష్ అనేక సంస్థలు, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. తన సేవలకు గుర్తుగా అంతర్జాతీయ వేదికపై ఆయన అవార్డును అందుకున్నారు.

# ఏబిఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో.. గురుపూజోత్సవం




వ్యాస పౌర్ణమి సందర్భంగా ఇటీవల తిరుపతిలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ (ఏబిఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా జరిగింది.

ఈ వేడుకలకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి అధ్యక్షత వహించి గురుపూజోత్సవ విశిష్టతను వివరించారు. ఈ వేడుకల్లో సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జిఎస్సార్ కృష్ణమూర్తి, జాతీయ సహ సంఘటన కార్యదర్శి జి.లక్ష్మణ్‌జీ, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు, ప్రొఫెసర్ గణపతి భట్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బుల్లి దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతిలోని విద్యా వైద్యం సాంస్కృతిక రంగాలలో నిష్ణాతులైన, సమాజానికి ఉత్తమ సేవలందిస్తున్న తొమ్మిది మందిని సన్మానించారు. వీరిలో కంచి మఠం ఆస్థాన విద్వాంసులు గణేష్, ఉప కులపతి ప్రొఫెసర్ జిఎస్సార్ కృష్ణమూర్తి, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సత్యనారాయణరాజు, ఎస్వి ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, మహిళా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ జమున దువ్వూరు, సిమ్స్‌లో సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మణిలాల్, ప్రఖ్యాత ఆక్యుపంచరిస్ట్ డాక్టర్ బాలాజీ, సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ దీప్త, ప్రొఫెసర్ గణేష్ భట్‌లతో పాటు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ సి.వాణి, కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, మీడియా ఇన్‌ఛార్జి డాక్టర్ మహేంద్రనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



### దేవాదాయశాఖ కమిషనర్‌ను కలిసిన ఆర్ఎస్ఆర్

సింహపురి గ్రామదేవత, నెల్లూరు చెరువు గట్టున కొలువైఉన్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఛైర్మెన్ ఆర్ఎస్ఆర్ (రావు శ్రీనివాసరావు) ఈనెల 5న విజయవాడలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయన్ను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధిపనుల విషయమై ఆయనతో చర్చించారు. అనంతరం అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్‌ని కూడా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మెన్ జి.దొరబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు మల్లు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాయర్
జులై 07, 2023

# భూగోళం 'చెత్తకుండీ'గా మారాల్సిందేనా?

రానురాను భూగోళమే ఒక చెత్తకుండీగా మారిపోతుందా?.. పనికిమాలిన వ్యర్థపదార్థాలతో భూమంతా నిండిపోతుందా?.. అంటే, అందుకు 'ఔను' అనే అంటున్నారు నిపుణులు. ఎక్కడ చూసినా అలివిమాలిన చెత్తాచెదారంతో భూమండలమంతా కలుషితమైపోతోందని, చెత్త నివారణకు ఎన్నిరకాల మార్గాలను అన్వేషిస్తున్నా, ఆచరణకు వచ్చేసరికి అన్నీ నామమాత్రంగానే ఉంటున్నాయని, ఎంతగా పరిశుభ్రం చేస్తున్నా కుప్పలుతెప్పలుగా చెత్త, వ్యర్థపదార్థాలు అన్ని ప్రాంతాల్లోనూ కుప్పలుతెప్పలుగా చేరుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చెత్త ఎవరూ తొలగించలేనంత స్థాయిలో పెరిగిపోతూనే ఉంది కూడా. ఒక్క నేల మీదనే కాదు, నదులు కాలువలు, జలాశయాలు, చివరికి మహాసముద్రాలను కూడా వ్యర్థపదార్థాలు ఆవరిస్తున్నాయి. దీంతో భూచరాలకే కాదు, జలచరాల ప్రాణాలమీదికి కూడా వస్తోంది. ఈ చెత్తను ఇలాగే వేసుకుంటూపోతే భవిష్యత్తులో కాలుష్యం మరింతగా పెరిగిపోయి చివరికి మానవాళి మనుగడకే ప్రమాదకరంగా తయారవుతుందంటున్నారు శాస్త్రవేత్తలు. అందులోనూ నేటి మన ఘన ఆధునిక కాలంలో, కంప్యూటర్లు, సెల్‌ఫోన్ల ప్రపంచంలో ఒక్క ఎలక్ట్రానిక్ వ్యర్థాలే కోట్లాది టన్నులుగా, ఒక్క మాటలో చెప్పాలంటే ఒక 'వ్యర్థ పదార్థ ప్రవాహం'గా తయారవుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రపంచవ్యాప్తంగా పారవేస్తున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు కనీసం ఏడాదికి 50 మిలియన్ టన్నుల దాకా ఉంటున్నాయని అంతర్జాతీయ స్థాయి అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వాటిని ముద్దుగా ఆంగ్లంలో 'ఇ-వేస్ట్' అంటున్నారు ఆధునికులు. ఇటీవలికాలంలో ఊహించనంత స్థాయిలో పేరుకుపోతున్న వ్యర్థపదార్థాల్లో ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లే ఉంటుండడం గమనార్హం. ఈ వ్యర్థాలను విలువకడితే కనీసం 62.5 బిలియన్ డాలర్లు ఉంటుందని, ఇది అనేకదేశాల జీడీపీ కంటే ఎక్కువని కూడా చెప్తున్నారు. ఇక ప్లాస్టిక్ వ్యర్థాలైతే ప్రపంచాన్నే ముంచెత్తుతున్నాయి. ఎక్కడ చూసినా అవే. వీటి నియంత్రణ అన్నది అసాధ్యంగా కనపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ చెత్తాచెదారం నివారణకు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు నడుం బిగించాల్సి ఉంది. తక్కువ వ్యర్థాలతో ఉత్పత్తులను సాగించడమే కాక, ఇప్పుడున్న పరిశ్రమల్లో కంటే అత్యంత పెద్ద పరిశ్రమలుగా..ఇలాంటి వ్యర్థాలనంతా రీసైకిల్ చేయగల భారీ పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరం కూడా ఉంది. తద్వారా వ్యర్థాల నివారణతో పాటు, అదొక కొత్త వ్యాపారంగా అభివృద్ధి చెంది, లక్షలాదిమందికి ఉపాధి కలుగుతుంది. అందుకే, గూగుల్, మైక్రోసాఫ్ట్, డెల్ కంపెనీల వంటి భారీ సంస్థలు 2030 నాటికి జీరో వేస్ట్ లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తున్నాయి.

మనదేశంలో కూడా ఈ చెత్తపరిస్థితి మరింత దారుణంగా ఉంది. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ భారత్ వంటివి కేవలం నినాదప్రాయంగానే మిగిలిపోతున్న నేటి రోజుల్లో అన్ని ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్నాయి. తాజాగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి లెక్కగట్టిన అధికారిక గణాంకాల ప్రకారం ఒక్క 2020-21లో దేశంలో రోజుకు లక్షా అరవై వేలా 39 టన్నుల వ్యర్థాలు వెలువడ్డాయంటే, దేశంలో ఈ చెత్త ఎంతటి పెద్ద సమస్యగా తయారవుతోందో తేటతెల్లమవుతోంది. దేశంలో తలసరి ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి రెట్టింపు అయిందని, వీటి ఉత్పత్తి 2019-20 లెక్కల ప్రకారం 34.69 లక్షల టన్నుల దాకా ఉందని తాజాగా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అనేసంస్థ అధ్యయనంలో తేలింది. ఇలా వ్యర్థాలు పెరుగుతుండడమే తప్ప తరుగుదల ఉండడం లేదు. మనదేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రాంతాలు కూడా ఈ చెత్తసమస్యతోనే అల్లాడుతున్నాయి. దేశంలో చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు కృషి జరుగుతున్నా, పెరుగుతున్న చెత్తకుప్పలతో పోలిస్తే అది కేవలం నామమాత్రంగానే ఉంటోంది. పెరిగిపోతున్న చెత్త వల్ల కాలుష్యం, దానివల్ల ప్రజలకు అనేకానేక రోగాలు తప్పడం లేదు. చెత్తను డంపింగ్‌యార్డ్‌లకు తరలించి రీసైక్లింగ్ చేయించడం అత్యవసరం. చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు శుద్ధి చేసుకునే ప్రక్రియలు దేశవ్యాప్తంగా తయారుకావాలి. చిత్తశుద్ధితో చెత్తను నివారించుకునేందుకు ఎన్నిరకాల మార్గాలున్నాయో శోధించి వాటిని చిత్తశుద్ధితో అమలుచేసేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన సమాయత్తం కావాలి. ఎట్లయినాసరే, ఆ వ్యర్థాలను నియంత్రించుకుని భూగోళాన్ని కాలుష్యం నుంచి కాపాడుకోవాలి. ఇది ప్రపంచవ్యాప్తంగా అందరి కర్తవ్యం.

## చెరువులు తవ్వేస్తున్నారు.. మట్టి తినేస్తున్నారు

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

జిల్లాలో ఇటీవలికాలంలో అక్రమార్కులు దేనినీ వదిలిపెట్టడం లేదు. కనీవినీ ఎరుగని విధంగా కనిపించిన చెరువులు దొరువులన్నిటినీ ఎవరిష్ట ప్రకారం వారు అడ్డదిడ్డంగా తవ్వేస్తున్నారు. జిల్లాలో దాదాపు వందకు పైగానే చెరువుల్లో అక్రమ మట్టి వ్యాపారం జోరుగా జరుగుతోందని వినికిడి. చివరికి మట్టిని కూడా వ్యాపారం చేసేసుకుని అక్రమార్జన చేసేస్తున్నారు. గతంలో ఇలాంటివి చేయాలంటే భయపడేవారు. గ్రామాల్లో ప్రజలు తిరగబడతారని భయం ఉండేది. ఇప్పుడలా కాదు, అధికారుల్ని, లేదా అధికార పార్టీని అడ్డం పెట్టుకుని ఆయా ప్రాంతాల్లో ఉన్న చోటా నాయకులు అదేపనిగా ట్రాక్టర్లు, ప్రొక్లయిన్లతో అక్రమంగా మట్టిని తరలించుకుపోతున్నారు. అదే పెద్ద వ్యాపారంగా తయారైంది. అడిగేవారు, అడ్డుకునేవారు లేకపోవడంతో, ప్రభుత్వం కానీ జిల్లా ఉన్నతాధికారులు కానీ అసలు పట్టించుకోకపోవడంతో మట్టి అక్రమరవాణా అన్నది నిరాఘాటంగా, నిర్భయంగా జరిగిపోతూనే ఉంది. ఒక్కరోజులోనే వందలాది ట్రాక్టర్లు మట్టితో, ఇసుకతో తరలిపోతున్నాయి. చెరువులను తవ్వుతుండడంతో ఆ చెరువుల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. చెరువుల్లోకి నీళ్ళొస్తే ఆ గుంటలు కనపడవు కనుక, అవి ప్రమాదకరంగా తయారవుతున్నాయి. ఇలా అక్రమంగా గుంతలు తవ్వడం, మట్టిని తరలించడం, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించడం పెద్ద నేరం.. అని అధికారులు చెప్తూనే ఉన్నా, అక్రమార్కులు ఎవరి మాటనూ వినడం లేదు. అధికారులు కూడా నాయకులను ఎదిరించలేక తమ పనేదో తాము చూసుకుంటున్నారు. గ్రామాల్లో ఎవరైనా ఆ వాహనాలను అడ్డుకుంటే అక్రమార్కులు తిరగబడి దౌర్జన్యాలు చేస్తున్నారు. ఇంత ఘోరం జిల్లాలో ఎప్పుడూ లేదు. ఈ అక్రమాలను అరికట్టే నాథులే లేరా? ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాలని విన్నపం.

– ఆర్.ఎస్ వెంకటశివయ్య, కావలి.

## హాస్టళ్లలో సమస్యలు తీరేదెప్పుడు?

జిల్లాలోని అనేక వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయి. ఏ హాస్టల్ చూసినా అపరిశుభ్రంగా, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థుల బాధ వర్ణనాతీతంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హాస్టళ్లను సందర్శించి సమస్యలను పరిష్కరించాలి. విద్యార్థులు బాగా చదువుకునేందుకు అన్ని మౌలిక సదుపాయలు ఏర్పాటుచేయాలి. కొన్ని హాస్టళ్లలో మురుగునీరు పోయే సదుపాయం కూడా లేదు. ముఖ్యంగా వెంకటాచలం హాస్టల్ మరింత దయనీయంగా ఉంది. హాస్టల్ వాతావరణం అంతా అపరిశుభ్రంగా ఉంది. ఎక్కడి చెత్త అక్కడనే ఉండి, మురుగునీటితో ఆవరణ అంతా దుర్గంధపూరితంగా తయారైంది. విద్యార్థులు తమ సమస్యలను ఎలా చెప్పుకోవాలో, ఎవరికి ఎలా చెప్పాలో తెలియక లోలోపలే మదనపడుతున్నారు. కొన్ని హాస్టళ్లలో మరుగుదొడ్లు, నీటి వసతి వంటివి కూడా అరకొరగానే ఉన్నాయి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు హాస్టళ్ళను పరిశీలించి పరిస్థితులను చక్కదిద్దుతారని కోరుకుంటున్నా.

బి.ఎస్.ఎల్.నర్సింహారావు, సర్వేపల్లి.

# సమాజంలోని అసమానతలను ఎలుగెత్తి చాటే.. 'దాహం..దాహం'

*"నిన్నటిదాకా కనుసైగల ప్రాబల్యంతో*
*లోకాన్ని జయించిన మనసు*
*ఇప్పుడు చేతివేళ్ళతో శాసిస్తున్నది*
*మనిసొక రిమోట్‌లా మారి*
*దాహంలో నిక్షిప్తమవుతుండడం,*
*నిశ్చేష్ట కావడం..నిబిడాశ్చర్యమే మరి!*
*......*
*మనిషికి దాహం*
*మనిషి దానికే దాసోహం*
*తప్పదు మరి!..ఇదో వైచిత్రం!*
*వాడి ఆయుష్షునంతా*
*తపస్సుగా మార్చుకొని*
*బొటనవేళ్ళ మీదే*
*చిత్రవిచిత్ర లోకాల్ని*
*చూడ్డం నేర్చుకున్నాక*
*వాడో విశ్వామిత్రుడు..*
*వాడి ఆగ్రహానికి గురికాలేం!"*.. అంటూ 'మంత్రదండ దాహాన్ని' అద్భుతంగా వర్ణించి, అనేక రకాల దాహాలకు ప్రతీకగా 'దాహం..దాహం' అనే దీర్ఘకవితను రచించి కవితారంగంలో తన ప్రత్యేక ప్రతిభాపాటవాలు చాటుకున్నారు నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి చిన్ని నారాయణరావు. ఈనెల 2న నెల్లూరులోని టౌన్‌హాలులో జరిగిన ఆ దీర్ఘకవితా



పరిచయం సాహితీలోకానికి వీనులవిందు చేసింది. చిన్ని నారాయణరావుతో పాటు ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, ప్రముఖ కవులు శ్రీరామకవచం సాగర్, డా. మేడిపల్లి రవికుమార్, డా. సుంకర గోపాలయ్య, నవ మల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ, పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ తదితరులు వేదికనలంకరించి ఈ అద్భుతమైన దీర్ఘకవితను ఆవిష్కరించారు. చిన్ని నారాయణరావు కవితా వైభవాన్ని, వైదుష్యాన్ని వక్తలు విశదీకరించి, సమాజంలోని అసమానతలను ఎలుగెత్తిచాటే 'దాహం-దాహం' దీర్ఘకవితలోని లోతైన భావాలను వక్తలు తమదైనశైలిలో వివరించారు. కవిత్వం అంటే ఏదో పదాడంబరంగా ఉండకూడదని, సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసి, సమాజాన్ని మేలుకొలిపేలా ఉండాలని, అలాంటి దీర్ఘకవితే 'దాహం దాహం' అని ప్రస్తుతించారు. డా. సుంకర గోపాలయ్య ఆ దీర్ఘకవితను ఆద్యంతం విశ్లేషణాత్మకంగా, ఆలోచనాత్మకంగా సమీక్షించి అందరి కరతాళధ్వనులందుకున్నారు. ఆడిటర్‌గా పని చేస్తున్న చిన్ని నారాయణరావు కవిగా..చక్కటి కవితలు, దీర్ఘ కవితలు రచిస్తూ, కవితారంగంలో నెల్లూరు కీర్తిని ఇనుమడింపజేస్తున్నారని అన్నారు. 'జీవితం ఓ విజయం', అంతర్ముఖం, గుండెదీపం, గంపకూడు వంటి వచన కవితాసంపుటాలతో పాటు ఆయన రచించిన 'మాట' దీర్ఘకవిత ప్రముఖుల ప్రశంసలందుకుందని వివరించారు. ఈ ఆవిష్కరణ సభను ప్రముఖ కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి నిర్వహించి అటు వక్తలకు, ఇటు సన్మాన గ్రహీతలకు, తొలుత జరిగిన కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రులకు సన్మానాలు చేశారు.

ఈ సందర్భంగా తనకు ఆత్మీయులైన పలువురు కవులను కవి చిన్ని నారాయణరావు సన్మానించి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఆ సన్మానాలందుకున్న కవుల్లో ప్రముఖులు నెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ప్రముఖ కవులు ఏటూరు నాగేంద్రరావు, బొగ్గరపు రాధాకృష్ణ, మోపూరు పెంచలనరసింహం, మద్దూరు శ్రీనివాసులుతో పాటు, తిరుపతికి చెందిన చిత్రకారుడు, చిన్ని నారాయణరావు చిరకాల మిత్రులు కంచనపల్లి ద్వారకానాథ్ కూడా ఉన్నారు. పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిగిన ఈ ఆవిష్కరణ సభ ఆద్యంతం అందరినీ అలరించింది.

## గోదాదేవి కల్యాణోత్సవం

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహస్వామి కొండపై కొలువైవున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 4న గోదాదేవి కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల నేతృత్వంలో వేద పండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాకాణి నరహరరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## గౌడ విద్యార్థులకు.. 16న పురస్కారాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల టెన్త్‌లో 450కి పైగా మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ఈనెల 16న పురస్కారాలను అందజేయనున్నారు. జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవాసమితి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆరోజున నెల్లూరులోని టౌన్‌హాలులో విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కోసూరు సుబ్బయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ కోసూరు పద్మగౌడ్ తెలిపారు.




# సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

## శ్రీసిటీ క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీ

జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అధైర్య పడకూడదని, మీరు సరైనదిగా భావించే నిర్ణయాన్ని ఆత్మస్థైర్యంతో తీసుకొని, త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే, ఎటువంటి సమస్యనైనా సరే పరిష్కరించగలుగుతారని పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీ విద్యార్థులకు సూచించారు.

ఈనెల 1న శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీ స్నాతకోత్సవం-2023 వేడుకగా జరిగింది. పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్, దౌత్యవేత్త, రచయిత గోపాలకృష్ణ గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని క్రియా విశ్వవిద్యాలయ యూజీ, పీజీ విద్యార్థులు, ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ బిజినెస్ స్కూల్ రెండు, మూడు సంవత్సరాల ఎంబీఏ విద్యార్థులు మరియు క్రియా, చెన్నై యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు, అవార్డులు ప్రదానం చేశారు. వీరితో పాటు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆరోగ్య, వైద్య రంగాలలో సేవలకు గాను విశిష్ట అతిథులు మాజీ కేంద్ర కార్యదర్శి సుజాతరావు, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్రా ఎల్లాలకు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. క్రియా విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఎన్.వఘుల్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు కపిల్ విశ్వనాథన్, ఐఎఫ్ఎంఆర్ జీఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ లక్ష్మీ కుమార్, సియాస్ అకడమిక్ డీన్ డాక్టర్ పృథ్వీ దత్తా శోబీ, ఇతర క్రియా అధికారుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఉత్తీర్ణతతో పాటు ప్రపంచ వ్యాప్త పరిజ్ఞానానికి, వివిధ సమస్యల పరిష్కారం కనుగొనేందుకు ధీటుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు క్రియా ప్రాధాన్యత ఇస్తోందని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు ఈ సందర్భంగా చెప్పారు. సామాజిక, ఆర్థిక పురోగతికి సంబంధించిన సవాళ్లను ఎదుర్కొనే మనస్తత్వం, సంకల్పం, నైపుణ్యాలు కలిగిన భావితరాల నాయకులను పెంపొందించడం తమ విద్యా లక్ష్యంలో భాగమని తెలిపారు.



# అల్లూరి జీవితం.. యువతకు స్ఫూర్తిదాయకం

## జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని, ఆ వీరుని ఆశయస్ఫూర్తితో సమాజ శ్రేయస్సు కోసం అందరూ పాటుపడాలని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 4న అల్లూరి జయంతి సందర్భంగా నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరిది ఒక మహోన్నత ఘట్టమని, దేశమాత దాస్యశృంఖలాలు ఛేధించేందుకు ఆయన చేసిన పోరాటం అద్వితీయమైనదని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పీ ఎం.గాంధీ, ఆర్ఐలు అంకమరావు, శ్రీనివాసరెడ్డి, డిపిఒ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెస్తోందని, అందులో భాగంగా ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యలో శిక్షణ ఇస్తున్నామని డిఇఓ గంగా భవాని చెప్పారు. ఈనెల 3న నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ డిజిటల్ టెక్నాలజీని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈనెల 15వ తేది వరకు జిల్లాలోని 7 ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ శిక్షణను ఉపయోగించుకుని డిజిటల్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్ఎస్ఏ ఏపీసీ సిహెచ్ ఉషారాణి, నెల్లూరు ఉప విద్యాశాఖాధికారిణి ప్రసన్న, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, ఎంఇఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద దారుశిల్ప కళాఖండం


- అద్భుతంగా రూపుదిద్దుకున్న 'అనంతశేషశయన విష్ణుమూర్తి' ప్రతిమ
- హైదరాబాద్‌లో ఆవిష్కరించిన భారత 13వ ఉపరాష్ట్రపతి మన వెంకయ్య



ప్రపంచంలోనే అతిపెద్ద అనంత శేషశయన విష్ణుమూర్తి దారుశిల్పం ఇటీవల ఆవిష్కృతమైంది. హైదరాబాద్‌లోని బోయినపల్లికి చెందిన అనూరాధ టింబర్స్ ఇంటర్నేషనల్‌కు చెందిన చదలవాడ శరత్‌బాబు, కిరణ్‌లు బర్మా టేకుపై చెక్కించిన ఈ అద్భుత కళాఖండాన్ని భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆవిష్కరించడం విశేషం.

**21అడుగుల పొడవు, 8.5అడుగుల ఎత్తు, 20అడుగుల కైవారంతో గిరిధర్‌గౌడ్ అనే చిత్రకారుడు ఈ శిల్పాన్ని అత్యద్భుతంగా రూపుదిద్దారు. బర్మాలో చెక్కించి భారత్‌కు తీసుకువచ్చారు. ప్రజలను, భక్తులను ఈ శిల్పం విశేషంగా ఆకట్టుకుంటోంది.**

దాదాపు 30 కోట్ల రూపాయల విలువైన టేకుచెట్టును వ్యాపారదృష్టితో ముక్కలు చేయకుండా, కళాత్మకమైన రీతిలో భగవంతుని రూపాన్ని తీర్చిదిద్దడానికి దానిని వినియోగించడం ఎంతైనా అభినందనీయం. అదే విషయాన్ని వెంకయ్యనాయుడు పేర్కొంటూ, ప్రపంచమంతా వ్యాపారమయమైపోతున్న నేటి పరిస్థితుల్లో, అందులోనూ ఆధ్యాత్మికత లోపిస్తున్న ఈ రోజుల్లో వ్యాపార దృష్టితో కాకుండా, కళాత్మక సృష్టితో ఇలాంటి అద్భుత శిల్పాన్ని ఆవిష్కరించడం తనకెంతో సంతోషం కలిగిస్తోందని రూపకర్తలను అభినందించారు. ఆది కాలం నుంచి మన పూర్వులు ఎంతో గొప్పదైన సంస్కృతిని మనకందించారని, ఆ వారసత్వాన్ని ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని అన్నారు. ఈ కళాఖండం అమూల్యమైనదని, విలువ కట్టలేనిదని అభివర్ణించారు. మన ప్రాచీన భారతీయ సంస్కృతికి, వారసత్వానికి ఇదొక ప్రతీక అని అన్నారు. రాబోయే తరాలవారికి ఒక అపూర్వమైన కానుకగా అందించాలని రూపకర్తలు ఈ శిల్పాన్ని ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి చెక్కించారని, నేటి తరం వారికే కాక, తరతరాల వారికి ఈ కళాత్మకత ఎంతో స్ఫూర్తిని, సందేశాన్ని ఇస్తుందని ఆయన కొనియాడారు.

# నెల్లూరు కబుర్లు

## విపిఆర్.. వితరణ

### రేబాల స్మశానానికి రూ.5 లక్షల విరాళం



బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో ఉన్న స్మశానాన్ని బాగుచేసి అభివృద్ధి చేసేందుకు ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 5 లక్షల రూపాయలు వితరణగా అందించారు. ఇటీవల రేబాల గ్రామ సర్పంచ్, మరికొందరు గ్రామస్తులు విపిఆర్‌ను కలుసుకుని స్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కావాలని అభ్యర్ధించారు. అందుకు స్పందించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 1న తమ వి.పి.ఆర్ ఫౌండేషన్ ద్వారా అయిదు లక్షల రూపాయలను ఇస్తున్నట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని వారికి వి.పి.ఆర్ ఫౌండేషన్ ప్రతినిధుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్స్ డే



జాతీయ వైద్యుల దినోత్సవం (నేషనల్ డాక్టర్స్ డే) సందర్భంగా జులై 1న నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ హాస్పిటల్‌లో డాక్టర్స్ డేని ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎందరో వైద్యులు సామాజిక సేవా దృక్పథంతో ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్నారని, క్యాన్సర్ ఆసుపత్రి లోనూ వైద్యులు ఉత్తమ సేవలందిస్తున్నారని అంటూ వారి సేవలను కొనియాడారు. మెడికల్ సూపరింటెండెంట్, క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మి, డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ హరితరాణిలను సన్మానించి అభినందించారు. పేషెంట్ కౌన్సిలర్ కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నెల్లూరు నగర

## ఇన్‌చార్జిగా.. నారాయణ



మాజీ మునిసిపల్ మంత్రి, నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణను నెల్లూరు నగర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఇటీవల ఒక ప్రకటనలో ఆ విషయం తెలియజేశారు. అదే విధంగా టీడీపీ నగర నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

## విజయ డెయిరీ ఎం.డీగా..కృష్ణమోహన్

విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎం.డీ)గా పి.సి కృష్ణమోహన్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎం.డీగా ఉన్న కొండూరు కృష్ణమోహన్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో డెయిరీ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్‌గా ఉన్న పి.సి కృష్ణమోహన్‌ను నియమించారు. ఈ సందర్భంగా నెల్లూరు వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీలో కొండూరు కృష్ణమోహన్ సేవలను కొనియాడుతూ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

## కవిపండితులకు సత్కారాలు

గురుపౌర్ణమి సందర్భంగా నెల్లూరు సుజాతమ్మ నగర్‌లోని కురువాడ సత్యనారాయణ కల్యాణమండపంలో ఈ నెల3న 72మంది కవిపండితులకు సత్కారాలు జరిగాయి. ప్రముఖ కవి, శ్రీ పంచాక్షరీ బ్రాహ్మణ జాగృతి సంస్థ నిర్వాహకులు ఆలూరి శిరోమణిశర్మ తన పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన శ్రీమద్ రామాయణ సహస్రనామ నిత్య స్తోత్ర కృతిని ఆవిష్కరించారు. ఆధ్యాత్మికవేత్త డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, కవయిత్రులు పాతూరు అన్నపూర్ణ, జి.సుభద్రాదేవి, మైపాడు రాజా పాల్గొన్నారు.



## వైకాపాలో చేరిన.. ఆనం జయకుమార్‌రెడ్డి

ఆనం సోదరుల్లో ఒకరైన టీడీపీ నాయకుడు ఆనం జయకుమార్‌రెడ్డి ఈనెల 3న వైకాపాలో చేరిపోయారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన వైకాపాలో చేరారు. సిఎం ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 20వ డివిజన్‌లో 'జగనన్న కంటివెలుగు'



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సూచనలతో ఇటీవల స్థానిక 20వ డివిజన్‌లోని వనంతోపు సచివాలయం పరిధిలో 'జగనన్న కంటి వెలుగు' కార్యక్రమం జరిగింది. దాదాపు 180 మంది వృద్ధులు, స్థానికులు వచ్చి వైద్యులను సంప్రదించి తమ కంటి సమస్యలను పరిష్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కంటివైద్యులు వెంకటలక్ష్మితో పాటు, 20వ డివిజన్ సీనియర్ నాయకులు, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్), స్థానిక నాయకులు రమేష్‌రెడ్డి, హెల్త్ సెక్రటరీ సంపూర్ణమ్మ, సచివాలయం సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## డాక్టర్ బిందుమీనన్‌కు మరో అవార్డు



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్, న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందు మీనన్‌కు మరో అరుదైన అవార్డు లభించింది. న్యూఢిల్లీలో సమాజ సేవ కోసం ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్స్ డే అవార్డు-2023ని జులై 1న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆమె అందుకోవడం విశేషం. భారత కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ జెసింగ్‌భాయ్ చౌహాన్, ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరద్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో దాదాపు 4 లక్షల మంది డాక్టర్లుండగా, ఇప్పటిదాకా 26 మంది వైద్యులు దేశం మొత్తం నుండి ఈ ప్రతిష్టాత్మక అవార్డు పొందారు. రోగులకు, వైద్య రంగానికి అంకిత భావంతో సేవలు అందిస్తున్నవారికి, ఇతరులకు స్ఫూర్తినిచ్చిన వైద్యులను సత్కరించడానికి జాతీయ వైద్యుల దినోత్సవ అవార్డును బహుకరిస్తారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు, ఐఎంఏ నెల్లూరు మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ జి.అశోక్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఫణిధర్‌కి, డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ నవీన్‌లకు ఆమె తన కృతజ్ఞతలు తెలిపారు.

## 'తంగిరాల మహాభారతం' 62వ భాగం

నారద మునీంద్రుడు ధర్మరాజుకి రాజధర్మోపదేశం చేయడం మొదలుపెడతాడు. ధర్మరాజా నీవు ధర్మ మార్గము యథావిధిగా అనుసరిస్తున్నావు కదా! రాజకార్యాలను ఉదయం సమయంలో అత్యంత జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకుంటున్నావు కదా. అర్హులను, శాస్త్ర నియమాలు తెలిసినవారిని మంత్రులుగా నియమించావు కదా. యజ్ఞయాగాదుల్లో యాజకుడు సక్రమంగా నిర్వహిస్తున్నాడు కదా. విశ్వాసపాత్రులను సైన్యాధ్యక్షులుగా నియమించావు కదా! సర్వసమర్ధులయిన మంత్రులు నీకు వ్యతిరేక కార్యాలలో దిగి నీకు ద్రోహం తలపెట్టలేదు కదా. ఎందుకంటే వారు ధన ధాన్యాలు స్వీకరించి దురాశపరులవుతారు. నీ జ్యోతిష్యులు రాబోయే ఉత్పాతాలను కనిపెట్టి శాంతిక్రియలు చేపడుతున్నారు కదా! వైద్యులు సరిగా ప్రజలకు ప్రేమతో సేవ




చేస్తున్నారు కదా! ఆర్థిక సంబంధిత కార్యాలలో నైపుణ్యం కలవారిని, నీతి నియమాలు కలవారిని నియమించావు కదా! వారివారి శక్తి సామర్థ్యాలను బట్టి వేతనాలిస్తున్నావా, రాజ్యంలో బందిపోట్లు లేకుండా ప్రజలను సంరక్షిస్తున్నావు కదా! యుద్ధంలో నీ కోసం ప్రాణాలు అర్పించిన వారి కుటుంబాలకు సహాయం చేస్తున్నావా? లోభబుద్ది కలవాళ్ళను, దొంగలను, శత్రువులతో స్నేహంగా ఉండేవాళ్ళను, పిరికివాళ్ళను, దుర్మార్గులను రాజకార్యాలను నిర్వహించడానికి పంపడం లేదు కదా! నీ రాజ్యంలో అనావృష్టి లేదు కదా! నీ రాజ్యంలో వర్షాలు పడి చెరువులన్నీ నిండి ఉన్నాయి కదా... ఇలా చాలా విషయాలు అనుగ్రహిస్తాడు.

తర్వాత నారదుడు మయసభ చూసి మెచ్చుకుని, ధర్మరాజు కోరికమేరకు, ముల్లోకాల్లో ఉన్న ఇంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మ సభలను వర్ణించి చెప్తుతాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**






## భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ



నెల్లూరు బాలాజీనగర్ చివరనున్న పద్మావతినగర్‌లో కొలువైవున్న శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఈ నెల 3న గురుపూర్ణిమ వేడుకలు వైభవంగా జరిగాయి. మందిరం ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో సాయినాధునికి ప్రత్యేక అలంకారాలు, పూజలు నిర్వహించారు. అఖండ సాయినామ సంకీర్తనతో మందిరం మార్మోగింది. అనంతరం పండరిభజనలు, కోలాటాలు పెద్దఎత్తున జరిగాయి. భారీసంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలు తిలకించారు. మందిరం గౌరవసలహాదారు పాబోలు రామసుబ్బయ్య, బాబిసాయి, దేవస్థానం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



# నెల్లూరులో మార్మోగిన.. 'యువగళం'

## లోకేశ్ పాదయాత్రకు పెద్దఎత్తున తరలివచ్చిన జనం

*నెల్లూరులో 'యువగళం' మార్మోగింది. టీడీపీ యువనేత నారా లోకేశ్ పాదయాత్రకు అపూర్వ స్పందన కనిపించింది. విద్యార్థులు, యువత, మహిళలు సైతం వేలాదిగా తరలివచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గంతోపాటు, నెల్లూరు రూరల్, నెల్లూరు నగర నియోజకవర్గాల్లో పెద్దఎత్తున జరిగిన ఈ కార్యక్రమం టీడీపీలో ఎంతో ఊపునిచ్చింది. లోకేశ్‌యాత్రకు నాయకులు భారీ జనసమీకరణ చేయడంతో ఎక్కడ చూసినా జనంతో పాటు పచ్చజెండాలు, పచ్చతోరణాలు వెల్లివిరిశాయి. మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులతో పాటు సీనియర్ టీడీపీ నాయకులంతా ఈ యాత్రలో లోకేశ్‌తో కలిసి నడిచారు.*

ఈనెల 4న వీఆర్‌సీ సెంటర్‌లో జరిగిన సభలో లోకేశ్ మాట్లాడుతూ టీడీపీకి నెల్లూరు రూరల్, నెల్లూరు నగర నియోజక వర్గాలు రెండూ రెండుకళ్ళ లాంటివని, తాము అధికారంలోకి వచ్చాక ప్రత్యేకించి ఈ రెండు నియోజకవర్గాలను మరింత బాగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సారథ్యంలో జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు. మార్పు నెల్లూరుతోనే మొదలవుతుంద న్నారు. నెల్లూరు నగరాభివృద్ధికి నారాయణ ఎంతగానో కృషిచేశారని, దాదాపు 4500 కోట్లు నగరాభివృద్ధికి ఖర్చుచేయడం జరిగిందని, భూగర్భ డ్రైనేజీకి టీడీపీ హయంలో వెయ్యికోట్ల నిధులు మంజూరు చేస్తే, ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ పనులు నిలిచి పోయాయని అన్నారు. తాము అధికారం లోకి రాగానే నెల్లూరులో భూగర్భడ్రైనేజీ వ్యవస్థను పూర్తిచేయిస్తామన్నారు. ఎన్టీఆర్ నెక్లెస్‌రోడ్డు, గణేశ్‌ఘాట్‌లను అభివృద్ధి చేస్తామన్నారు. నగరంలో స్వర్ణకారులు పడుతున్న కష్టాలు తమకు తెలుసని, స్వర్ణ కారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. వైకాపా నాయకులు కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపిస్తూ, తాము అధికారంలోకి వస్తే వైకాపా అవినీతిపై 'సిట్'చే దర్యాప్తు చేయి స్తామన్నారు. పార్టీకి అండగా ఉంటున్న కార్యకర్తలకు ఎల్లవేళలా రక్షణగా ఉంటా మని స్పష్టం చేశారు. ఈ యాత్రలో మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, పరసా రత్నం, కొల్లు రవీంద్ర, తాళ్లపాక రమేష్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి, అనేకమంది నాయకులు, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



## ముత్తుకూరులో దద్దరిల్లిన సభ

➤ **ఆకట్టుకున్న లోకేశ్, సోమిరెడ్డి ప్రసంగాలు**

'యువగళం పాదయాత్ర' ఈనెల 2న జిల్లాలోని సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీమంత్రి, తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారథ్యంలో భారీఎత్తున జరిగింది. లోకేశ్ సభకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి నీరాజనాలు పలికారు. ఎక్కడ చూసినా జనప్రభంజనం అన్నట్లుగా ముత్తుకూరంతా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో నిండిపోయింది. ఈ సందర్భంగా లోకేశ్, సోమిరెడ్డిల ప్రసంగాలు ప్రజల్ని బాగా ఆకట్టుకున్నాయి. వైకాపా విధానాలను వారు తూర్పారబట్టారు. ప్రత్యేకించి జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి తీరుపై లోకేశ్ విరుచుకుపడ్డారు. మద్యం మీదున్న అవగాహన ఆయనకు వ్యవసాయం మీద లేదన్నారు. జిల్లాలో ఒక్కరైతుకైనా మీరు న్యాయం చేశారా?.. అని ప్రశ్నించారు. పదవిని అడ్డం పెట్టుకుని కోట్లు తినేస్తున్నారని, కరోనాని కూడా అడ్డం పెట్టుకుని కోట్లల్లో స్వాహాచేశాడని అంటూ కాకాణిపై మండిపడ్డారు. తాము అధికారంలోకివస్తే అవినీతిపరులు తిన్నవన్నీ కక్కిస్తామని హెచ్చరించారు. ఈ యాత్రలో టీడీపీ నాయకులు పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

### రూరల్‌లో జనప్రభంజనం

నెల్లూరురూరల్‌లో లోకేశ్ పాదయాత్ర జనప్రభంజనంగా మారింది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి సోదరుల సారథ్యంలో కాకుపల్లి నుంచి యువగళం పాదయాత్రలో జనం వేలసంఖ్యలో పాల్గొన్నారు. దారిపొడవునా ప్రజలు నాయకులకు హారతులిచ్చి, ఘనంగా స్వాగతించారు. రూరల్‌తో పాటు నెల్లూరు నగర నాయకులు, టీడీపీ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో...

# 'తెలుగు యువత'నుంచి.. 'వైకాపా'లోకి



తెలుగు యువత కోవూరు నియోజకవర్గం అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ కోవూరు పంచాయతీ 4వ వార్డ్ మెంబర్ బెల్లంకొండ విజయ్‌కుమార్ ఇటీవల తెలుగుయువత నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై ఆయన తన అనుచరులతో పాటు వైకాపాలో చేరారు. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, యువజన విభాగం కమిటీ అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వారు వైకాపాలో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసి ఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఎన్.సుబ్బారెడ్డి, జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, శివుని నరసింహులురెడ్డి, పీఏసీ ఛైర్మెన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, సర్పంచ్ విజయమ్మ అత్తిపల్లి అనుప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అండగా...



కోవూరు నియోజకవర్గంలోని ఎందరో చిన్నారులకు, ఆపదలో ఉన్నవారికి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మానవతా దృక్పథంతో సాయం అందిస్తుండడం పట్ల నియోజకవర్గ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇందుకూరుపేట మండలంలో పర్యటిస్తుండగా కొన్ని కుటుంబాల్లో కొంతమంది తల్లిని, కొంతమంది తండ్రిని కోల్పోయిన పిల్లలను చూసి ఆవేదన చెందారు. ఆ చిన్నారుల భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని వారికి తమవంతు సాయం అందించారు. గంగపట్నం గ్రామానికి చెందిన కర్పూరం సంతోష్‌కు రూ.25 వేలు, ఇందుకూరుపేటకు చెందిన సంఘం పల్లవికి రూ.20 వేలు, రాముడుపాలెం గ్రామానికి చెందిన షేక్ సుహానకు రూ.20వేలు, షేక్ సోఫియాకు రూ.20 వేలు మొత్తం రూ.85 వేల రూపాయలను ఆయన తన తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ పిల్లలకు 18సంవత్సరాలు వచ్చేంత వరకు ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, ఆ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా పాములువారిపాళెంకు చెందిన టి.భార్గవ సాయిశ్రీకి రూ.20 వేలు, లేబూరు జెస్సీకి రూ.20 వేలు, లేబూరు ప్రియాంకకు రూ.20 వేలు, దరువుకట్ట కండ్రిగకు చెందిన కొండా చాణిక్యకు రూ.20వేలు వంతున మరో రూ.80 వేల రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి వారికి అండగా నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.

## ఆదర్శనీయుడు అల్లూరి

### ఘనంగా 125వ జయంతి



విప్లవవీరుడు అల్లూరి సీతారామా రాజు 125వ జయంతి కార్యక్రమం నెల్లూరులో ఈనెల 3న వేడుకగా జరిగింది. శ్రీరామకృష్ణ వివేకానంద భావప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బత్తిన సాయి కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, నేటితరానికి అల్లూరి ఆదర్శ మన్నారు. మహనీయుల జీవితాలను అవగాహన చేసుకుని విద్యార్థులు తమ జీవితాలను చక్కదిద్దుకోవాలన్నారు. ఏపి యుడబ్ల్యూజె నాయకుడు ఏ.జయప్రకాష్, శ్రీనివాసులు, మహేష్, హర్షవర్ధన్, నవీన్, మురళి, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# సహకార ఉద్యోగుల సమస్యలు తీర్చండి

ప్రభుత్వోద్యోగుల మాదిరిగానే తమకు కూడా ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, జీతాలు పెంచాలని, ఎంతోకాలంగా ఉన్న తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సహకార ఉద్యోగులు ఈనెల 3న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా సంఘం నాయకుడు రామనాయుడు సారథ్యంలో ఈ ధర్నా జరిగింది. సహకార సంఘాల్లో ఉన్న ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని, 2019 తర్వాత సహకార సంఘాల్లో పనిచేస్తున్న



ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. తొలుత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.




# వింజమూరులో త్వరలో డయాలసిస్ కేంద్రం

## ● గణపం బాలకృష్ణారెడ్డి చొరవతో.. కలెక్టర్ గ్రీన్‌సిగ్నల్



మండల కేంద్రమైన వింజమూరులో త్వరలో రోగులకు అత్యంత అవసరమైన డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కానుంది. అందుకు జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి చొరవ తీసుకుని, ఆ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురావడం, అందుకు కలెక్టర్ ఆ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఈనెల 4వ తేదీ మంగళవారం రాత్రి ఆకస్మికంగా వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ సమాచారం తెలుసుకుని గణపం బాలకృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలుసుకుని, ఒక్క వింజమూరులోనే డయాలసిస్ బాధితులు సుమారు 30మంది దాకా ఉన్నారని, దూర ప్రాంతాల ఆసుపత్రులకు వెళ్ళి డయాలసిస్ చేయించుకోలేక వారెంతగానో అవస్థలు పడుతున్నారని కలెక్టర్‌కు చెప్పారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే వింజమూరు సామాజిక ఆరోగ్యకేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

# 'వాత్సల్య'కు డాక్టర్ శ్రీనివాసరాజు విరాళం

నెల్లూరులోని జనహిత –వాత్సల్య అనాథ శరణాలయానికి ప్రముఖ గుండెవైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరాజు ఈనెల 3న తన పుట్టినరోజు సందర్భంగా, ఆ సంస్థకు 50 వేల రూపాయల విరాళం ఇచ్చారు. వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావుకు ఆ మొత్తాన్ని అందజేశారు. డాక్టర్ శ్రీనివాసరాజు తన జన్మదిన వేడుకలను నిరాదరణకు గురైన బాలబాలికల మధ్య నిరాడంబరంగా జరుపుకోవడం అభినందనీయమని రాష్ట్రప్రభుత్వోద్యోగుల సంఘం జిల్లా ఛైర్మెన్ సుధాకర్‌రావు అన్నారు. అనంతరం శ్రీనివాసరాజును సత్కరించారు. మానవసేవే మాధవసేవ బృందం నిర్వాహకులు విశ్వనాథం, కోలా రవి, ఇందిర, పుల్లారెడ్డి, శ్రీనివాసులు, విజయమ్మ, శైలజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



# రోశయ్యకు 'పద్మవిభూషణ్' ఇవ్వాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్యకు 'పద్మవిభూషణ్' అవార్డును ప్రకటించాలని నెల్లూరులోని స్వాతంత్ర్యసమరయోధుడు కెవి చలమయ్య రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 4న రోశయ్య 90వ జయంతి సందర్భంగా చలమయ్య తన నివాసంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్యవైశ్యులు ఆరాధించే మహనీయ వ్యక్తి, మచ్చలేని ప్రజా నాయకుడు రోశయ్య అని, వారు చేసిన నిస్వార్థసేవలు భావి తరాలకు ఆదర్శమని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఆర్యవైశ్య నాయకులు ఆర్‌వి శరత్‌చంద్ర, నగరకంటి రవీంద్రనాథ్, సొల్లేటి నాగేశ్వరరావు, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు కల్యాణ చక్రవర్తి, దర్శి నరసింహారావు, పేర్ల జనార్దన్, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

## - రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మెన్ విక్టర్‌ప్రసాద్



ఇటీవల సైదాపురం పోలీసు స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకుని, తిరుపతి స్విమ్స్‌లో మరణించిన వంగపాటి ఆకాష్ కుటుంబానికి అండగా ఉండి, ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మెన్ ఎం.విక్టర్ ప్రసాద్ తెలిపారు. రాపూరు మండలం, జోరేపల్లి పంచాయతీ పరిధిలోని అక్కమాంబపురం గ్రామానికి చెందిన వంగపాటి ఆకాష్‌ను ఇటీవల ఓ కేసు నిమిత్తం సైదాపురం పోలీసుస్టేషన్‌కు తీసుకుని వెళ్ళడం, స్టేషన్‌లో ఆకాష్ ఆత్మహత్యాయత్నం చేసుకొని, తిరుపతి స్విమ్స్‌లో మరణించడం జరిగింది. ఈనెల 3న రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మెన్ యం.విక్టర్‌ప్రసాద్, అధికారులతో కలసి అక్కమాంబపురం గ్రామానికి చేరుకొని మృతుని తల్లిదండ్రులు అంకయ్య, సుజాతలను పరామర్శించారు. ఆ కుటుంబానికి అండగా ఉండి ప్రభుత్వపరంగా అన్నివిధాలుగా ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. మృతికి కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వపరంగా మృతుని కుటుంబానికి అందాల్సిన నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ముఖ్యంగా ఎస్సీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎస్సీ కమిషన్ పనిచేస్తోందని తెలిపారు. ఎస్సీ కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ కుల, మత, వర్గ వివక్ష లేకుండా అందరికీ సామాజిక న్యాయం అందజేశారని, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు రాజ్యాంగ హక్కులను అమలుచేసే దిశగా ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట నెల్లూరు ఆర్డీఓ మలోల, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, డీఎస్పీలు కోటారెడ్డి, వెంకటరమణ, రాపూరు తహసీల్దార్ వై.సుభాషిణి, పొదలకూరు ఎ.ఎస్.డబ్ల్యూ.ఓ నరసింహారెడ్డి, పలు దళిత సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# జగనన్న సురక్ష... ప్రజలకు రక్ష



- ఆర్డీవో కిరణ్‌కుమార్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ఆ పత్రాలను ఇంటి వద్దే అందించి పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందించిందని ఆర్డీవో కిరణ్ కుమార్ పేర్కొన్నారు. 3వ తేదీ స్పందన కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రజలకు ఓ అండ అని, ఆ కార్యక్రమానికి ప్రజలు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది జగనన్న సురక్ష గడపగడప సర్వే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించి కుటుంబాలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను మంజూరు చేయాలని ఆర్డీఓ తెలిపారు. ముందుగా ప్రతి కుటుంబానికి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలను సమగ్రంగా సేకరించి నమోదు చేసుకుని, అనంతరం సురక్ష సర్వే జరిగిన 7వ రోజు నుండి కుటుంబాలకు అవసరమైన ధృవ పత్రాలను గ్రామసభలు నిర్వహించి ఉచితంగా అందిస్తారన్నారు. తప్పనిసరిగా 11 రకాల అంశాలకు సంబంధించి ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించి వారికవసరమైన ధృవీకరణ పత్రాలను ఇప్పించాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు.

# రోటరీ క్లబ్ కొత్త సైన్యం



రోటరీ క్లబ్ ద్వారా ఎంతో మంది పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ బి.శ్యాంయాదవ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని జూలై 2వ తేదీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సి.రామకృష్ణస్వరూప్, కార్యదర్శిగా పి.శ్రావణ్‌కుమార్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. క్లబ్ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, కె.మునిగిరీష్, వి.బాలకృష్ణంరాజు, సునీల్‌కుమార్, రవికుమార్, రాంప్రసాద్, ఎన్.ఎస్.రెడ్డి, డి.రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్లకు సత్కారం

అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 1వ తేదీ గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు తమ వైద్య సేవలతో స్వాంతన చేకూర్చిన డాక్టర్లు ఎస్.కె.షరీనా, పి.మోహన, వి.సందీప్ శ్రీనివాస్, ఎం.మధుసూదన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దేవుడు జన్మనిస్తే, డాక్టర్లు పునర్జన్మనిస్తారని.. అలాంటి వారిని సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీనియర్ డాక్టర్ చంద్రహాస్, హెడ్ నర్స్ గౌరి, ఆసుపత్రి సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# వేడుకగా గురుపౌర్ణమి

గూడూరు, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. విద్యుత్‌దీప కాంతులతో మందిరాన్ని అందంగా అలంకరించారు. 'ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి' అఖండ నామ సప్తాహంతో మందిరం మార్మోగింది. బాబా వారికి వివిధ రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేసి, మంగళ వాద్యాలతో పల్లకిసేవ, సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. అనేకమంది భక్తులు బాబా వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



# ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్సీ మేరిగ

ఈ నెల 5వ తేదీ చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రేణిగుంట విమానాశ్రయం వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్. ఆయన వెంట కోట వైసిపి నాయకులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి కూడా ఉన్నారు.

# లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



2023–24 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ప్రస్తుత ప్రెసిడెంట్ డి.రవీందర్‌రెడ్డి అధ్యక్షతన క్లబ్ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎస్ఎల్ఎన్ స్వామి, సెక్రటరీగా గోపీనాథ్‌రెడ్డి, ట్రెజరర్‌గా పి.వి.మనోజ్‌కుమార్‌లను ఎన్నుకోవడం జరిగింది. పాస్ట్ రీజన్ ఛైర్మెన్ ఆర్.వి.రావు, పాస్ట్ జోన్ ఛైర్మెన్ మురళీనాయుడు, పాస్ట్ ప్రెసిడెంట్ పెల్లేటి వెంకట్రామిరెడ్డిలు సేవా కార్యక్రమాల నిమిత్తం పదివేల రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా వై.వేణురెడ్డి, కె.బాబురావు, వరదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, లయన్స్ సభ్యులు తదితరులు 2022–23 సంవత్సరంలో వైజేపీ లయన్స్ క్లబ్‌కు ఎనలేని సేవలు అందించిన డి.రవీందర్‌రెడ్డి, పి.వి.మనోజ్‌కుమార్, గోపీనాథ్‌రెడ్డిలకు వీడ్కోలు పలుకుతూ సన్మానించారు.



## యువనేతకు ఆత్మీయ శుభాకాంక్షలు

'యువగళం' పాదయాత్రలో భాగంగా ఇటీవల నెల్లూరుజిల్లా, సర్వేపల్లి నియోజకవర్గంలోని గోపాలపురానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపి, అభినందిస్తున్న కర్ణాటక తెలుగుదేశం పార్టీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి.

### ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా..

## డాక్టర్ జమున



నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ తలిశెట్టి జమున నియమితులయ్యారు. ఇప్పటిదాకా ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ వి.మురళీకృష్ణ ఉద్యోగ విరమణ పొందడంతో, ఆ స్థానంలో నగరంలోని పెద్దాసుపత్రిలో సీనియర్ వైద్యురాలిగా, అనస్థీషియా వైద్యనిపుణురాలిగా పని చేస్తున్న డాక్టర్ జమునను ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల నియామక ఉత్తర్వులిచ్చారు.

## మట్టి మాఫియాను అరికట్టండి

**బీజేపీ నేత మిడతల**

నెల్లూరు జిల్లాలో మట్టి మాఫియాను నిరోధించడంలో జల వనరుల శాఖ అధికారులు విఫలమయ్యారని, జిల్లా ఉన్నతాధికారులైనా రంగంలోకి దిగి అక్రమ మట్టి తవ్వకాలపై గట్టి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. మట్టిమాఫియా ధాటికి దాదాపు100కు పైగా చెరువులు గుంతల మయమయ్యాయని పేర్కొన్నారు. ఆమేరకు ఆయన నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు ఇటీవల ఫిర్యాదుచేశారు. జిల్లాలోని కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గ పరిధిలోని పలు చెరువులలో కొద్దిపాటి అనుమతులు తీసుకొని, అదేపనిగా భారీ యంత్రాలతో పరిధి దాటి మట్టిని విక్రయించుకుంటున్నారని, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఇటుక బట్టీలకు అక్రమ మట్టి తరలిపోతూ ఉందని ఆయన తన వినతిలో పేర్కొన్నారు. అధికారపార్టీ పాలకుల ఒత్తిడికి తమ ఉద్యోగ ధర్మాన్ని సైతం విస్మరించి ప్రకృతి వనరులను కాపాడడంలో అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. కనిగిరి రిజర్వాయర్‌ను కుళ్ళ పొడవడంతో రిజర్వాయర్ నుండి నీరు సీపేజ్ రూపంలో బయటకు వస్తోందని, ఈ విషయంలో లోకాయుక్త నిలదీసినా సమాధానం చెప్పుకోలేని స్థితిలో అధికారులు ఉన్నారని, ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి మట్టి మాఫియా ఆగడాలను అరికట్టి చెరువులు గుంతల మయం కాకుండా చూడాలని ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సుబ్రమణ్యం, బి.నారాయణ, పైడిమాని కృష్ణ చైతన్య, ఏ రాము తదితరులు పాల్గొన్నారు

### జులై 15లోగా..

## ఈకెవైసి చేయించుకోవాలి

జిల్లాలోని ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరూ ఈకెవైసి చేయించుకోవాలని, జిల్లా ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ గంగాద్రి తెలిపారు. ఈనెల 1న ఆయన నెల్లూరులోని ట్రెజరీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఇంకా అనేకమంది ఈకెవైసి నమోదు చేయించుకోవాల్సి ఉందని, వారంతా తప్పనిసరిగా ఈ ప్రక్రియలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.



## విద్యుత్‌భవన్ వద్ద విపక్షాల ధర్నా

విద్యుత్ ఛార్జీలు పెంచడం దారుణమని, పెరిగిన ఛార్జీలతో ప్రజలు నానా అవస్తలు పడుతున్నారని, ఇచ్చిన హామీలను విస్మరించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఛార్జీలు పెంచి ప్రజలను వేధిస్తున్నారని ఇటీవల నెల్లూరులో విపక్షాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాందోళన నిర్వహించారు. విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిపిఎం నాయకుడు కత్తి శ్రీనివాసులు, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, బత్తల కృష్ణయ్య, అరిగెల నాగేంద్రసాయి, రామరాజు, ఆంజనేయులు, సిరాజ్, నాగేశ్వరరావు, కిన్నెర కుమార్, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

**విఎస్‌యు రిజిస్ట్రార్**



మొక్కలు పర్యావరణ పరిరక్షణకు, మానవ మనుగడకు ఎంతో ముఖ్యమని, ప్రతి ఇంటా ప్రతిచోటా మొక్కలను విరివిగా నాటి సంరక్షించుకోవాలని నెల్లూరులోని విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి అన్నారు. విఎస్‌యు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఇటీవల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మామిడిమొక్కలు నాటారు. నానాటికీ పెరిగిపోతున్న నేటి కాలుష్యవాతావరణ పరిస్థితుల్లో మొక్కల పెంపకం ఎంతైనా అవసరమని, భావితరానికి మనం ఇచ్చే గొప్ప సంపద మంచి వాతావరణమేనని చెప్పారు. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జీఎం సుందరవల్లి సూచనల మేరకు ప్రతి ఒక్కరూ ఒక్కొక్క మొక్కను నాటి సంరక్షించాలని విద్యార్థులను కోరారు. విఎస్‌యు అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ జి.సుజయ్‌కుమార్, డెప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.హెచ్ సాయిప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, బయోటెక్నాలజీ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొని మొక్కలు నాటారు.

## కావలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కావలిలోని వెంగళరావునగర్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విశ్రాంత అధ్యాపకులు ఎం.వి ప్రసాదరావు సతీమణి స్వర్గీయ బివి రత్నమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులందజేసి అభినందించారు. కావలిలోని ఎంపిఎల్ ఉన్నత పాఠశాల, శ్రీ పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల, కావలి పాతవూరు మునిసిపల్ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు ఇచ్చారు. ట్రస్టు ఛైర్మెన్ ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు కె.సుబ్బారావు, విశ్రాంత అధికారి ఎస్‌కె ఖాదర్‌బాషా, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మెన్ అమరజ్యోతి, వైస్ ఛైర్మెన్ సయ్యద్ ఘనీబాషా, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు ఎస్‌కె ఖాదర్‌బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబటి ఆంజనేయులుకు ఏపీయుడబ్ల్యుజె నివాళి



ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర గౌరవ సలహాదారు, పత్రికా రంగంలో సుదీర్ఘ కాలం పని చేయడంతో పాటు జర్నలిస్టుల యూనియన్ నాయకునిగా పాత్రికేయ రంగానికి ఎనలేని సేవలు చేసి ఇటీవల పరమపదించిన అంబటి ఆంజనేయులు మృతి బాధాకరమని, ఆయన లేని లోటు తీరనిదని నెల్లూరులోని ఏపీయుడబ్ల్యుజె నాయకులు పేర్కొన్నారు. ఆంజనేయులు మృతికి చింతిస్తూ ఈనెల 1న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సంతాపసభలో పలువురు జర్నలిస్టులు, యూనియన్ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీయుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి అనుమల జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కె.దయాశంకర్, కోశాధికారి హనూక్, ఎస్. వెంకటసుబ్బయ్య, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా సంఘం అధ్యక్షులు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### రాపూరు శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేకపూజలు

రాపూరులోని మద్దెలమడుగు సెంటర్‌లో ఉన్న శ్రీ మహావిష్ణు, శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవాలను ఇటీవల ఘనంగా నిర్వహించారు ఆలయంలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మహావిష్ణు స్వామివారికి కళ్యాణోత్సవం చేపట్టి, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ సేవా సమాజం వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

### ఓగూరులో రైతుభరోసా కేంద్రం తనిఖీ

కందుకూరు నియోజకవర్గంలోని ఓగూరులో ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్, నెల్లూరుజిల్లా ప్రత్యేక అధికారి సిహెచ్ హరికిరణ్ ఆకస్మికంగా పర్యటించి రైతుభరోసా కేంద్రాన్ని, అనంతరం సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరు పరిశీలించి తగు సూచనలు చేశారు. కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, జేడీ జి.సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

### ఉలవపాడులో ఇంటింటికీ వైద్యం

మండల కేంద్రమైన ఉలవపాడులో ఇటీవల 'ఫ్యామిలీ ఫిజిషియన్' కార్యక్రమంలో భాగంగా సచివాలయం పరిధిలోని పరిగచేను సంఘంలో 104 వాహనం ద్వారా ఆరోగ్యసిబ్బంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి వారికి తగు సేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ దివ్యత, సచివాలయం ఏఎన్ఎం పద్మ, అల్తాఫ్ అహ్మద్‌లతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### భైరవరంలో 'జగనన్న సురక్ష'పై అవగాహన

దుత్తలూరు మండలంలోని భైరవరంలో ఇటీవల 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా అందుతున్న 11 రకాల ఉచిత సేవలపై తహశీల్దార్ సోమ్లానాయక్ ప్రజలకు అవగాహన కలిగించారు. సచివాలయం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్వామా పీడీ వెంకట్రావు, ఎంపీడీఓ సాయిప్రసాద్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### కాళయకాగొల్లులో కోళ్ళ వ్యర్థాల వాహనాలు స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కాళయకాగొల్లులో చేపల గుంటలకు కోళ్ళ వ్యర్థాలను సరఫరా చేస్తున్న 3 వాహనాలను ఇటీవల మత్స్యశాఖ అధికారులు పట్టుకున్నారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎఫ్‌డిఓ పొట్టెయ్య చెప్పారు.

### కొట్టాలులో మట్టి మాఫియా పట్టివేత

చేజర్ల మండలంలోని కొట్టాలు గ్రామంలో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్న మట్టి మాఫియాను జిల్లా మైనింగ్ అధికారులు ఇటీవల పట్టుకున్నారు. 20 ట్రాక్టర్లను, ఒక ప్రొక్లయిన్‌ను స్వాధీనం చేసుకుని, వాటి సొంతదారులకు లక్షా 64వేల రూపాయలు జరిమానా విధించారు.

### కోవూరులో ఘనంగా గురుపూర్ణిమ ఉత్సవాలు

కోవూరులోని జాతీయరహదారి వద్ద ఉన్న శ్రీ షిరిడీసాయి దేవాలయంలో గురుపూర్ణిమ ఉత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకులు జగదీష్‌స్వామి, పద్మనాభస్వామి సాయినాథునికి ప్రత్యేకపూజలు, పూలంగిసేవ చేశారు. దేగపూడి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయానికి.. లక్షా నూటపదహార్లు విరాళం

నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయానికి లక్ష్మీనరసింహారావు-అమ్మణ్ణి దంపతులు ఇటీవల లక్షా నూటపదహారు రూపాయలు విరాళంగా సమర్పించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి ఆ విరాళాన్ని వెచ్చించాలని వారు ఆలయ నిర్వాహకులను కోరారు.

### ఉపాధ్యాయ పురస్కారాలకు.. 15లోగా ప్రతిపాదనలు

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2023కి సంబంధించి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జులై 15వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని, వివరాలకు వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు.

# కేంద్రంలో కమలానికి... కూటమితో ఓటమి తప్పదా?

(మొదటి పేజీ తరువాయి)

60శాతానికి పైగా ఓటర్లు బీజేపీని తిరస్క రించారు. ప్రతిపక్షాల అనైక్యత వల్ల బీజేపీ అధికారంలోకి రాగలిగింది అనే పాయింట్ ఆధారంగా ఈ 15 పార్టీల కూటమి ఏర్పా టైంది. ఇప్పుడు ఈ కూటమి తొలి కర్తవ్యం రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక ఓటు చీలకుండా నివారించడం. ఢిల్లీ గద్దెపై ఎవరి ఆశలు వారివే? ఈ కూటమిలో ఒకరిద్దరు మినహా అందరూ బడా నేతలే కాబట్టి వీరి మధ్య ఐక్యత ఏమేరకు ఫలిస్తుందన్నది ఆసక్తి రేపుతోన్న అంశం. గత నెలాఖరులో ఆర్జేడీ నితీష్‌కుమార్ చొరవతో పాట్నాలో జరిగిన కూటమి సమావేశం 2024 సార్వత్రిక ఎన్నికలు అతి భయంకర భీకరపోరుగా జరగబోతున్నాయన్న సంకేతాలైతే స్పష్టంగా పంపుతోంది.

అయితే, బీజేపీ కూడా ఇందుకు ధీటుగా బదులిస్తోంది. పాట్నా సమావేశం ముగిసి 10రోజులు గడవకముందే మహా రాష్ట్రలో ఎన్సీపీని చీల్చి మోడీ తన సత్తా నిరూపించుకున్నారు. ఎన్సీపీలో ఈ అనూహ్య చీలిక జాతీయస్థాయిలో ప్రకంప నలు సృష్టిస్తోంది. బీజేపీ వ్యతిరేక కూట మిలో శరద్‌పవార్ కీలకంగా వ్యవహరిస్తు న్నారు. ఇప్పుడు శరద్‌పవార్‌నే బీజేపీ ఆత్మ రక్షణలోకి నెట్టేసింది. ఇదే కాదు ఈశాన్య రాష్ట్రాల్లో క్రిస్టియన్లకు అండగా ఉండడం, పస్మండా ముస్లింలను దగ్గరకు తీసుకోవా లని మోడీ పిలుపునివ్వడం లాంటివన్నీ కూటమిని నిలువరించే ప్రయత్నాలే. భిన్న మతాలు, భిన్న వర్గాలకు, భిన్న ఆలోచన లకు బీజేపీలో చోటు ఉంటుందని మోడీ తన చేతల ద్వారా చూపిస్తున్నారు.

## మోడీని... ధీటుగా ఎదుర్కోగలరా?

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఎవరికీ తలవంచని ఆయన వ్యక్తిత్వం బీజేపీకి ఉన్న పెద్ద ఆస్తులు. కుటుంబం కూడా లేని వ్యక్తి కాబట్టి అక్రమంగా కూడబెట్టే అవసరం లేదని, కాబట్టి అవినీతి రహి తంగా నిష్పక్షపాతంగా దేశాన్ని పరిపాలిస్తు న్నారంటూ ఈ 9 ఏళ్లలో ఆయన వ్యక్తిత్వా నికి పెద్దపీట వేస్తూ పబ్బం గడుపుతోంది కమలం పార్టీ. ఆ ప్రచారాన్ని బలంగా తిప్పి కొట్టగలిగితేనే ప్రతిపక్షాలు ప్రజల దృష్టిని ఆకర్షించగలవు. దేశంలో జరిగిన 15 పార్టీల కూటమి సమావేశం కంటే కూడా నరేంద్ర మోడీ అమెరికా, ఈజిప్టు పర్యటనలు హైలైట్ అవుతున్నాయంటే ఆయన ఛరిష్మా ఎంత బలమైందో అర్థం చేసుకోవచ్చు. 2014 నుంచి నరేంద్ర మోడీ, అమిత్‌షా నేతృత్వంలోని బీజేపీ ఎదుగుతూ వస్తోంటే... కాంగ్రెస్ పతన మవుతూ వస్తోంది. 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీ 303 లోక్‌సభ సీట్లు గెలిస్తే, కాంగ్రెస్ గెలిచింది 53 సీట్లు మాత్రమే.

మోడీ-షా భాషలో మాట్లాడగల సత్తా కూటమి నేతలకు ఉందా..? అన్నది ఇక్కడ పెద్దప్రశ్న. ఒకవేళ ఉన్నా, సిద్ధాంత పరంగా మోడీ-షా ద్వయంతో ఢీకొట్టగలరు తప్ప, వారికి ధీటుగా ఎత్తుకు పైఎత్తులు వేసి మోడీకి వచ్చిన ఛరిష్మాని జనం మనసు లలోనుండి తొలగించగలరా అన్నది మరో ప్రశ్న. ప్రధానమంత్రిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసైనా ఆయన ఇమేజ్‌ని తగ్గించ గలిగితేనే కమలం వాడేది, కూటమి విక సించేది అని కూడా మోడీ వ్యతిరేకవర్గాలు భావిస్తున్నాయి.

## కూటమి అసంతృప్తులే బీజేపీ బలం...!

సాధారణంగా జాతీయపార్టీ అయినా, ప్రాంతీయ పార్టీ అయినా అసంతృప్తులు ఉంటాయి. కాంగ్రెస్‌లో ఇవి మరీ ఎక్కువ. అలాంటిది 15 పార్టీల కూటమిలో అసం తృప్తులు లేకుండా చేయడం సాధ్యమేనా..? పదవి వ్యామోహంతో ఒకరికొకరు కొట్టు కోకుండా చూసుకోవడమే కూటమికి పెద్ద సవాల్. లేదంటే ఆ కుమ్ములాటలే ఆస రాగా బీజేపీ రాజకీయాలు చేసి కూటమిని విచ్ఛిన్నం చేయగలదు. పైగా మోడికి ధీటుగా 15 పార్టీల కూటమిలో ఉత్సా హాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చే వాగ్ధాటి ఉన్న శక్తివంతమైన నాయకులు కూటమిలో ఎవరూ లేరు...? మొదటి సమావేశంలోనే ఢిల్లీ ఆర్డినెన్స్ విషయంలో ఆప్‌కి, కాంగ్రెస్‌కి కలహాలు మొదలయ్యాయి. యూపీలో సమాజ్‌వాదీ పార్టీకి కాంగ్రెస్, బీఎస్పీలతో, బెంగాల్‌లో తృణమూల్‌కు కాంగ్రెస్, వామపక్షాలతో, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్ లలో ఆప్‌కి కాంగ్రెస్‌కి ఉప్పు నిప్పు స్థాయిలో విభేదాలున్నాయి. ఇవన్నీ బీజేపీకి బ్రహ్మాస్త్రాలే.

## 15 కత్తులు... ఒకే ఒర

ఢిల్లీ ఆర్డినెన్స్ విషయంలో కాంగ్రెస్, ఆప్ మధ్య ఉన్న విభేదాలు తొలగించుకు నేందుకు ప్రయత్నిస్తామని రాహుల్‌గాంధీ చెప్పినా, కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామని మమతా బెనర్జీ అన్నా, కాంగ్రెస్ తమకు శత్రువు కాదని అఖిలేష్ యాదవ్ ఉద్ఘా టించినా, తమకు జాతి సమగ్రతే ముఖ్య మని ఉద్ధవ్‌ఠాక్రే ఉద్రేకపడినా... వీరం దరిలోనూ బీజేపీని గట్టిగా ప్రతిఘటించా లన్న లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఆంధ్రాలో బీజేపీ, వైసీపీ, టీడీపీ ఇంకా తమ వైఖరి ప్రకటించలేదు. కాంగ్రెస్, బీజేపీని ఒకే గాటిన కట్టిన బీఆర్ఎస్ వైఖరి గందరగోళంగా ఉంది. బీఎస్పీ ధోరణి షరామామూలే. పాలకపక్షాన్ని ఎదుర్కొనేం దుకు ఇది మంచి ప్రయత్నమే. విజయం దక్కాలంటే ముందుగా ప్రతిపక్ష పార్టీలన్నీ తమ మధ్యనున్న విభేదాలను రూపుమాపు కోవాలి. కాంగ్రెస్, ఆప్, ఎస్పీ, వామ పక్షాలు, తృణమూల్ కాంగ్రెస్‌కి పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్నాయి. ఈ పార్టీలు కలిసి ఎలా నడుస్తాయన్నది ఆసక్తికరమే. రెండు కత్తులే ఒక ఒరలో ఇమడలేవనేది సామెత. ఇప్పుడిక్కడ ఉన్నది 15 కత్తులు. ఇవన్నీ ఒకే ఒరలో ఇమడాలంటే ఏదో మాయ జరగాల్సిందే.

## 10 నెలల్లో ప్రజల నమ్మకం చూరగొనగలరా?

బలమైన పాలకపక్షాన్నీ, జనాకర్షక విన్యాసాల్లో దిట్ట అయిన నరేంద్ర మోదీని ఎదుర్కోవాలంటే ప్రతిపక్షాలన్నీ పాత పగలను మర్చిపోవాల్సిందే. లేనిపక్షంలో ప్రత్యర్థిని ఏ మాత్రం ఇరుకున పెట్టలేరు. సొంత ఇగోలు, స్వప్రయోజనాల కంటే కూడా ఉమ్మడి శత్రువుపై విజయమే లక్ష్యంగా ఉండాలి. బీజేపీపై కలిసి పోరాటం చేయాలన్న ఆశయ సాధనలో ఇది ముందడుగు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికలకు 10 నెలల సమయం మాత్రమే ఉంది కాబట్టి, ఈ కూటమిపై ప్రజల్లో నమ్మకం కల్పించడం 15 పార్టీలకి ప్రధానం. కూటమిని ప్రజల్లో పలుచన చేయడం బీజేపీకి అవసరం. ప్రజల్లో తమపై నమ్మకం కల్పించడం కంటే, కూటమిని పలుచన చేయడం భాజపాకి సులభమైన పని. ఇప్పటికైతే ఆ పనిని బీజేపీ సునాయాసంగా చేసుకుపో గలదన్నది రాజకీయ పండితుల అంచనా.

## పరస్పర నమ్మకం ఉంటేనే గెలుపు

ఒకప్పుడు కాంగ్రెస్, ఇందిరాగాంధీ లకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ సారధ్యంలో సాగిన ప్రతిపక్ష ప్రయోగం లాగా మళ్లీ అంత నమ్మకం కలిగించగలిగి తేనే ఏ కూటమి అయినా ఫలిస్తుంది. ప్రభుత్వ లోటుపాట్లు ఎత్తిచూపుతూ, ప్రజల పక్షాన నిలబడి అధికారపక్షాన్ని నిలదీసే ధృఢమైన ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వా మ్యంలో రాజకీయ వ్యవస్థ మనుగడ సాగిస్తుంది. 9 ఏళ్ల తర్వాత దేశంలో ఇప్పుడా అవసరం ఉందన్నది మెజారిటీ వర్గాల వాదన. తాజా పాట్నా భేటీ అంద రిలో ఆశలు రేపుతోంది. పాట్నా సమావే శంలో ఢిల్లీ ఆర్డినెన్స్‌పై కాంగ్రెస్ మౌనం వహించిన తర్వాత ఆప్ మీడియా సమా వేశానికి దూరంగా ఉంది. మొదటి సమా వేశంలోనే కలహాలు మొదలైతే ఎన్నికలు అయ్యేంతవరకు కలిసి నడవడం సాధ్య మేనా? ఈ కూటమి ఆద్యుడు నితీష్‌కుమారే గతంలో బీజేపీలో చేరారు. అధికారం కోసం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. ఇం తటి చంచలమైన మనస్తత్వం కలిగిన వ్యక్తి ఈ కూటమికి నాయకత్వం వహించడం పట్ల అనేక ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. శరద్‌పవార్, ఉద్ధవ్ ఠాక్రే, డీఎంకే, ముక్తి మోర్చా కాంగ్రెస్‌కు మిత్రపక్షాలు కావడం నితీష్, ఖర్గేలకు ఉపశమనం కలిగించ వచ్చు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర ఫలితంగా శ్రీనగర్‌లో ఫరూక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్, మెహబూబా ముఫ్తీ, పీడీపీ కూడా కాంగ్రెస్ వైపు చూసే అవ కాశాలున్నాయని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. ఇలా అనేక అపోహలు, అనుమానాలు, ఆటంకాలు, అవరోధాలు ఉన్న కూటమితో బీజేపీకి ఓటమి అంత ఈజీ కాదన్నది రాజకీయవర్గాల భావన.

## తెలుగు రాష్ట్రాల అధ్యక్షుల మార్పు వెనుక మర్మం ఏమిటి...?

బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ కీయపార్టీగా ఆవిర్భవించినా తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఎదుగూబొదుగూ లేకుండా దశాబ్దాలుగా ఎదురీదుతోంది. అప్పట్లో వాజ్‌పేయి - అద్వానీల నాయ కత్వంలోనూ, ఇప్పుడు మోడీ - అమిత్ షా కాలంలోనూ ఆంధ్రాలో కాషాయ పార్టీ తోకపార్టీగానే మిగిలిపోయింది.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షుల మార్పునకు కారణం కుల రాజ కీయాలే. తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గం కాంగ్రెస్ దిశగా ఆకర్షితమవు తోంది. పైగా కేసీఆర్‌కి బీజేపీకి మధ్య దూరం బాగా తగ్గడం తెలిసిన విషయమే. అందుకే బీసీ సామాజిక వర్గంలో దూకుడు స్వభావం గల సంజయ్‌ని బండి దించి కిషన్‌రెడ్డికి పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్ప జెప్పారని రాజకీయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

అలాగే, ఏపీలో కూడా రెడ్డి సామాజిక వర్గం వైసీపీ వెంట, కమ్మ సామాజికవర్గం టీడీపీ వెంట ఉందని బీజేపీ గత కొంత కాలంగా భావిస్తోంది. అందుకే కాపులను ఆకర్షించడం కోసం అదే సామాజికవర్గా నికి చెందిన కన్నా లక్ష్మీనారాయణకు, సోము వీర్రాజుకు అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పారు. అయినా ఫలితం శూన్యం. అందుకే ఈసారి కమ్మ సామాజికవర్గానికి చెందిన పురందేశ్వరికి బీజేపీ అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పారని రాజకీయ విశ్లేష కులు భావిస్తున్నారు. మరోవైపు రాబోవు ఎన్నికలలో బీజేపీ, టీడీపీల మధ్య సయోధ్య కుదిరితే నందమూరి వారసురాలిగా పురంధరేశ్వరిని తెరముందుంచి బాబుని తెరవెనుకకు పంపాలన్న కమల దళ వ్యూహంలో భాగమే ఈ నియామకమని కూడా అంటున్నారు. ఈసారైనా ఏపీలో బీజేపీ భవితవ్యం మారుతుందా లేదా ఎప్పట్లానే తోక పార్టీలానే మిగిలిపోతుందా అన్నది వేచిచూడాలి...!

# మన్యం వీరుని త్యాగం.. అసామాన్యం

## - భారతప్రభుత్వ క్షేత్రప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి




ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి అపూర్వమని, ఆయన త్యాగనిరతి అసామాన్యమని, యువతకు అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకమని భారత ప్రభుత్వ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, జాతీయ అల్లూరి యువజనసంఘం, నెల్లూరులోని అవెన్యూ సీనియర్ సెకండరీ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి 125వ జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 4న ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో భారత ప్రభుత్వ క్షేత్రప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటీష్‌పాలకుల దౌష్ట్యాలకు మగ్గిపోతున్న అడవితల్లి బిడ్డలకు అల్లూరి అండగా నిలిచారన్నారు. స్వరాజ్యం కోసమే కాక మహోన్నత లక్ష్యాల కోసం అల్లూరి తన జీవితాన్ని త్యాగం చేశారని ఆయన కొనియాడారు. తొలుత విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అల్లూరి రేఖాచిత్రాల ప్రదర్శన, తోలుబొమ్మలాట-యోగాసనాలతో అల్లూరి పేరు ఆవిష్కర ణతో పాటు నృత్యప్రదర్శనలు అలరించాయి. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు బహుకరించి అభినందించారు. లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, అల్లూరి జాతీయ యువజన సంఘం అధ్యక్షురాలు పి.రమాదేవి, ఏపియుడబ్ల్యుజె నాయకుడు ఏ.జయప్రకాష్, ప్రిన్సిపాల్ నీరా ప్రసాద్, డీన్ పెన్నబల్లి కృష్ణచైతన్య పాల్గొన్నారు.

# 10-11 తేదీల్లో.. అంగన్‌వాడీల ఆందోళన

అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచాలని, సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, పెండింగ్ జీతాలను వెంటనే మంజూరు చేయాలని... తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు ధర్నాందోళనకు సిద్ధమవుతున్నారు. ఆమేరకు ఇటీవల వారు నగరంలోని డాక్టర్ రామ చంద్రారెడ్డి భవన్‌లో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కామాక్షమ్మ, రజని, కల్పన, హేమ, మల్లెమ్మ, భాగ్యమ్మ, రమాదేవి, లక్ష్మి, మాధవి, కల్యాణి, మైథిలి, సుప్రజ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# యనమల కృష్ణయ్య



సామాజిక సేవకుడు, అజాతశత్రువు, ఆధ్యాత్మిక సేవాతత్పరుడు యనమల కృష్ణయ్య జులై 3వ తేదీ సోమవారం తన 80వ ఏట కన్నుమూశారు. ఆయన స్వగ్రామం మినగల్లు. అతి సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన కృష్ణయ్య హైస్కూలు విద్య ముగించిన వెంటనే గూడూరులో ఒక మైనింగ్ సంస్థలో ఉద్యోగిగా చేరారు. కొద్దికాలం అక్కడ పనిచేసిన అనంతరం ముత్తుకూరుకి మకాం మార్చి అక్కడ సొంతంగా మెడికల్ షాప్ ప్రారంభించి తన వ్యాపార ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత ఆక్వా రంగంలో ప్రవేశించి అంచెలంచెలుగా ఎదిగారు. చాముండేశ్వరి ఫీడ్స్ పేరుతో పరిశ్రమని స్థాపించి పారిశ్రామికవేత్తగా నెల్లూరులో స్థిరపడ్డారు. స్వతహాగా మృదుస్వభావి. పేద విద్యార్థులను చదివించడమంటే ఆయనకి మహా ఇష్టం. చాలా కుటుంబాలలో వెలుగులు నింపారు. ఎవరూ ఆకలితో అలమటించకూడదన్నది ఆయన సిద్ధాంతం. తమ సంస్థలలో ఉద్యోగులందరికీ ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించి వారి అభిమానాన్ని చూరగొన్నారు. ఆయనకి భార్య సుగుణమ్మ, కుమారులు శ్రీనివాస్, శ్యామ్‌ప్రసాద్, పెంచలరమేష్ ఉన్నారు. జులై 3వ తేదీ సోమవారం నాడు గురుపూర్ణమి పర్వదినాన్ని భక్తి పూర్వకంగా నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుని అదే రోజు ఉదయం నిద్రలోనే దైవసాన్నిధ్యం పొందారాయన. కృష్ణయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# దివ్యాంగులకు నిత్యావసర సరుకులు



గూడూరు ఆంధ్ర మహిళా మండలి మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యుల సహకారంతో గత ఆరు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా దివ్యాంగులకు అందిస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఈ నెల 5వ తేదీ త్యాగరాజ వీధిలోని శ్రీ కళ్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో జరిగింది. రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అమరావతి హాస్పిటల్ అధినేత నిర్మల దాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ దివ్యాంగులకు తమ క్లబ్ సభ్యుల సహకారంతో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నామని, భవిష్యత్తులో కూడా దీనిని కొనసాగిస్తామని తెలియజేశారు. ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు విష్ణువందన, సెక్రటరి శశిరేఖ, లక్ష్మి, పరంజ్యోతి, స్నేహలతారెడ్డి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్షతో సరికొత్త అధ్యాయం

జగనన్న సురక్షతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు పట్టణంలోని 1, 12వ వార్డు, పోటుపాలెం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పొణకా దేవసేనమ్మతో కలసి మంగళవారం ఆయన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైసిపి సీనియర్ నాయకులు బత్తిన విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# 'విశ్వోదయ' రూపశిల్పి..విద్యాదాత డా.డిఆర్

కావలి పట్టణంలో విశ్వోదయ విద్యా సంస్థలను రూపుదిద్ది ఎందరో విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాటు చేసిన మహోన్నత విద్యాదాత డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డా.డిఆర్) అని, ఆయన చేతిచలువతో చదువుకున్న వేలాదిమంది విద్యార్థులు ఇప్పుడు సమాజంలో ఉన్నత స్థానంలో రాణిస్తున్నారని వక్తలు కొనియాడారు. ఈనెల 4న కావలిలోని జవహర్ భారతి అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో జవహర్‌భారతి కళాశాల ప్రాంగణంలో డా.డిఆర్ 94వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మీ వినయ్‌కుమార్‌రెడ్డిలు పాల్గొని డిఆర్ స్తూపానికి పుష్పమాలికలు అలంకరించి నివాళులర్పించారు. విద్యతోనే పేదరికం పోతుందనే భావనతో డా.డిఆర్ ఆనాడే ఎందరో విద్యార్థులకు చదువులు చెప్పించి వారి భవితవ్యానికి బాటలు వేశారని అధ్యాపకులు పేర్కొన్నారు. అనంతరం కళాశాల సిబ్బందికి నూతన వస్త్రాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రాజ గోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డా.ఆర్ మాల్యాద్రి, డా.సుబ్రహ్మణ్యంనాయుడు, సీనియర్ అధ్యాపకులు డా.జె.కృష్ణప్రసాద్, జేబిటీఏ కార్యదర్శి డా.వెంకట్రావు, కోశాధికారి డా.టి.విశాలాక్షి పాల్గొని డా.డిఆర్‌కు నివాళులర్పించారు.



# కాలనీలను త్వరితంగా నిర్మించాలి

**- కమిషనర్ వికాస్‌మర్మత్**

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన కార్మికులను నియమించుకుని త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 4న ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో గృహనిర్మాణ అధికారులు, మెప్మా అధికారులతో సమావేశమై కాలనీల నిర్మాణాల విషయాలను సమీక్షించారు. కాలనీలు నిర్మించేటప్పుడే ప్రజలకు అవి అందుబాటులో ఉండేలా రవాణా సదుపాయాలను ఏర్పాటుచేయాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన వాటిని లబ్దిదారులకు అందజేసేందుకు కృషిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ఆయన పలు సచివాలయాల కేంద్రాలను పరిశీలించి, జగనన్న సురక్ష కార్యక్రమం పథకం అమలుకు సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

# ఉమ్మడి పౌర స్మృతితో పౌర కల్లోలం!



భారతీయ జనతా పార్టీకి మాతృక అయిన జనసంఘ్ పుట్టిన 1967 నాటి నుంచి... ఒక ఆలోచనగానే ఉన్న 'ఉమ్మడి పౌర స్మృతి' ఇప్పుడు ఒక వాస్తవ రూపంలోకి దాదాపుగా వస్తోంది. ప్రధానమంత్రి పదవిలో ఉన్న నరేంద్ర మోడీ దీనిని బయటకు తీశారు.

ఇప్పటికే, పూర్తి మెజారిటీతో 2014, 2019లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ... 2024లో కూడా 'పూర్తి మెజారిటీ'తో అధికారంలోకి రావడానికి... ఈ అంశాన్ని తెరమీదకు తీసుకు వస్తున్నారు.

నిజానికి, దేశానికి (మనకు కాదు) స్వాతంత్ర్యం వచ్చిన రోజునే, దేశంలో ఉమ్మడి పౌర స్మృతి అమలును ప్రకటించి ఉండాల్సింది. లేదంటే, భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 జనవరి 26 నుంచి దీనిని అమలులోకి తీసుకువచ్చి ఉండాల్సింది.

అయితే, మన నేతలకు 'ఓటు బ్యాంకు' రాజకీయాలపై ఉన్న మక్కువ వల్ల, పౌర జీవనానికి ప్రాణ సమానమైన ఈ ఉమ్మడి పౌర స్మృతి అనేది ఒక ఆలోచనగానే ఉండిపోయింది.

దీనికి సంబంధించి ముఖ్యమైన విశేషం ఒకటి ఉంది.

ఇన్నాళ్ళు ఇది మన్ను తిన్న పాము లాగా మరుగునపడి ఉండడానికి, నేతల 'ఓటు బ్యాంకు' రాజకీయ మనస్తత్వం ప్రధాన కారణం అయితే... అది ఇప్పుడు బుసలు కొట్టుకుంటూ బయటకు రావడానికి కూడా 'ఓటు బ్యాంకు' రాజకీయమే ప్రధాన కారణం.

హిందూ సమాజానికి ప్రభుత్వం నిర్దేశించిన పౌర స్మృతి, ముస్లింలు అనుసరించే 'పౌర స్మృతి'కి భిన్నం. ఇప్పుడు, ముస్లింలతో పాటు ఇతర మతాల, జాతుల, తెగల వారు అనుసరించే పౌర స్మృతులను... హిందూ పౌర స్మృతిలోకి తీసుకురావడమే... ఉమ్మడి పౌర స్మృతి లక్ష్యం.

పౌర స్మృతి వేరు. శిక్షా స్మృతి వేరు.


శిక్షా స్మృతి అనేది దేశం మొత్తానికి వర్తిస్తుంది. దీనికి హిందువులు... ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, బుద్ధులు వంటి తరతమ భేదాలు లేవు. శిక్షకు పాత్రమైన నేరం ఏ వర్గ, కుల, మత, జాతి, తెగలకు చెందిన వారు చేసినా న్యాయస్థానంలో శిక్ష ఒకే రకంగా ఉంటుంది.

ఎటొచ్చి, పౌర స్మృతిలోనే తేడాలు.

హిందూ సమాజంలో మహిళలకు... పురుషులతో సరిసమానం అనదగిన పౌర హక్కులు ఉన్నాయి.

- హిందువులలో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పురుషులకు ఉన్నట్టుగానే మహిళలకూ సమానంగానే ఉన్నాయి.
- వారసత్వ ఆస్తిపాస్తులపై మగపిల్లలతో పాటు, ఆడపిల్లలకూ సమాన హక్కులు ఉన్నాయి.
- వివాహం విడాకుల వరకూ వస్తే, మహిళకు పురుషుడు నెలవారీ భరణం ఇవ్వాల్సి ఉంటుంది.
- చట్ట బద్ధతగా నమోదు కాని విడాకులు చెల్లవు.
- హిందువులలో బహుభార్యత్వం చెల్లదు. మొదటి భార్య రాతపూర్వక అంగీకారం లేకుండా, మరో మహిళను వివాహం చేసుకోవడం చెల్లదు. పైపెచ్చు నేరం కూడా.
- కుటుంబ నియంత్రణకు సంబంధించిన పద్ధతులను హిందువులే పాటిస్తారు.

ఇవేవీ ముస్లింలు సాధారణంగా పాటించరు. ముస్లిం పౌర జీవనంలో పురుషాధిక్యత చాలా ఎక్కువ. తలాక్ తలాక్ తలాక్ అని మూడుసార్లు చెబితే... భార్యకు విడాకులు ఇచ్చినట్టేనన్న ఆచారం ముస్లిం సమాజంలో అనాదిగా వస్తోంది. విడాకులు ఇచ్చిన భార్యకు ఎటువంటి భరణానికీ... విడాకులు ఇచ్చిన భర్త పూచీపడడు. బహుభార్యత్వం ముస్లింలలో అతి సాధారణ విషయం.




(ఇటీవల యూపీలో ఒక హిందూ భర్త కన్ను... ఒక ముస్లిం యువతిపై పడింది. హిందూ భార్యకు తెలియకుండా ముస్లిం మతం స్వీకరించి... ఆ ముస్లిం యువతిని పెళ్లి చేసుకుని, సరదా తీర్చేసుకున్నాడు)

ఒక రకంగా... ముస్లిం మహిళ పురుష దురహంకారానికి బలైపోతుందని కూడా అనేవారు లేకపోలేదు.

ఇప్పుడు, ముస్లిం మహిళలను కూడా దేశపు జనజీవన స్రవంతిలోకి.... హిందూ మహిళల హక్కులతో సమానం స్థాయికి తీసుకురావాలి అనేది బీజేపీ ఆలోచన.

దీనివల్ల, దాదాపు పది కోట్ల ముస్లిం మహిళల అభిమానం పొందవచ్చు.

అయితే, ముస్లిం ఐడెంటిటీ అనేది పోతుంది అనే కారణంగా ముస్లిం పురుషులు దీనిని జీర్ణం చేసుకోలేరు. ప్రపంచమంతా ముస్లిం సమాజం ఆచరించే ఆచార వ్యవహారాలను భారతదేశంలో ఆచరించడానికి ముస్లిం పురుషులకు కుదరదు. భారత శిక్షా స్మృతి... ముస్లిం మహిళలకు రక్షణగా ఉంటుంది. మిగిలిన మతాలలో సైతం మహిళలకు కుటుంబ జీవనంలో ఇటువంటి ఇబ్బందుల లాంటివి ఏమైనా ఉంటే సర్దుకుంటాయి. అప్పుడు 'ఒకే దేశం – ఒకే పౌర స్మృతి' అని బీజేపీ ఘనాతిఘనంగా ప్రకటించుకోగలుగుతుంది.

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ వ్యూహాత్మకంగా ఈ అంశాన్ని బయటకు తీసింది. భారతీయ సమాజాన్ని హిందువులు... ముస్లింలుగా విడదీసి చూడడానికి ఈ ఎత్తుగడ పనికి వస్తుంది.

దేశంలోని చాలా పార్టీలు కక్కలేని... మింగలేని స్థితిలో పడిపోతాయి.

ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రధాన పార్టీలు అయిన వైసీపీ, టీడీపీ జనసేన... ఉమ్మడి పౌర స్మృతిపై ఏమీ మాట్లాడలేవు అనేది కొందరు పరిశీలకుల భావన.

ఈ ఉమ్మడి పౌర స్మృతి అమలును వ్యతిరేకిస్తే.. నరేంద్ర మోడీ కన్నెర్రచేసే 'ప్రమాదం' ఉంది. దీనిని స్వాగతిస్తే.. ముస్లింల ఆగ్రహానికి గురి అవుతామనే భయం ఉంటుంది.

ఇటువంటి 'అవకాశ'వాద ధోరణిలోనే దేశంలోని చాలా ప్రాంతీయ పార్టీలు ఉండే అవకాశం ఉంది.

దీనికి తాము వ్యతిరేకం కాదు అని ఢిల్లీ 'ఆప్' పార్టీ ఇప్పటికే ప్రకటించింది. మిగిలిన పార్టీలు తమ విధానాన్ని ప్రకటించాల్సి ఉంది. అయితే, లోక్‌సభలో పూర్తి మెజారిటీ బీజేపీకి ఉంది. రాజ్యసభ దగ్గరకు వచ్చేసరికి మన వైసీపీ, మన టీడీపీ... బీజేపీకి ఎదురు చెప్పే పరిస్థితి లేదు. అలాగే, ఒడిస్సా నవీన్ పట్నాయక్ కూడా బీజేపీకే జై అంటారు. బిల్లు పాస్ కావడానికి ఈ మద్దతు సరిపోతుంది. అప్పుడు, 'ఒకే దేశం... ఒకే పౌర స్మృతి' అంటూ దీనినొక భావోద్వేగ రాజకీయ అంశంగా సమాజం ముందుకు బీజేపీ తీసుకువస్తుంది. ఈ అంశాన్ని... కాంగ్రెస్‌తో సహా ఇతర రాజకీయ పక్షాలు ఎలా 'హేండిల్' చేస్తాయో అనేది ఆసక్తికరమైన అంశమే. ఎందుకంటే.. తన అధీనంలోని ప్రచార సాధనాలతో, బీజేపీ ముస్లిం సమాజాన్ని మానసికంగా కకావికలు చేయడానికి చేసే ప్రయత్నంలో హిందూ సమాజాన్ని తనకు అనుకూలంగా సంఘటితం చేయడానికి సర్వశక్తులు ధారపోస్తుంది. అది, పౌర కల్లోలానికి దారితీసినా తీయవచ్చు.

**- భోగాది వేంకట రాయుడు**

medhomadhanam@gmail.com



# ఎందరో మహానుభావులు..
# అందరికీ వందనాలు

ఖండాంతరాలు దాటి వచ్చినా మన ఆత్మలు, అంతరాత్మలు, ఆశయాలు, ఆకాంక్షలు, అభిరుచులు, ఆలోచనలు ఒక్కటే అని మరోసారి రుజువు చేశారు.

జూన్ 30, జులై 1, 2 తేదీలలో అమెరికాలో జరిగిన **'నాటా' ద్వైవార్షిక సమావేశాలకు** అమెరికా నలుమూలల నుండి అశేషంగా తరలివచ్చి..
ఇది **"మన తెలుగువారి పండుగ - మనందరి పండుగ"** అని
ఘన విజయం చేసిన మీ ఆదరణని, అభిమానాన్నీ ఎప్పటికీ మరువలేను.

మన మాతృభాష తెలుగు మనందరినీ ఒకటిగా చేస్తోంది. మనల్ని ఒక చోటుకి చేరుస్తోంది. ఒక తాటిపై నడిపిస్తోందనడానికి **'నెవర్ బిఫోర్ - ఎవర్ ఆఫ్టర్'** అన్న స్థాయిలో రమణీయ, కమనీయ, చిరస్మరణీయ వేడుకగా చరిత్రలో నిలిచిపోయేలా జరిగిన ఈ **'నాటా'** సంరంభమే అతిపెద్ద ఉదాహరణ.

ఈ అపూర్వ, అపురూప, అఖండ విజయానికి కారణమైన మిత్రులు, ఆప్తులు, ఆత్మీయులు, ఆత్మబంధువులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అపారమైన పేరు ప్రఖ్యాతులు, గుర్తింపు పొందిన ఈ **"ఉత్తర అమెరికా తెలుగు సమితి"**కి వెన్నెముక లాంటి వ్యవస్థాపక సారథులు **డాక్టర్ ప్రేమ్‌రెడ్డి, చైర్మెన్, ఎమిరటస్ గారికి** నా **ప్రత్యేక ధన్యవాదాలు.**

నాటా సంక్షేమమే ఆయన శ్వాసగా, ధ్యాసగా, బాసగా తపిస్తున్న సేవాభిలాషి డాక్టర్ ప్రేమ్‌రెడ్డి గారు.


నా అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో డాక్టర్ ప్రేమ్‌రెడ్డి గారిని **'జీవిత సాఫల్య పురస్కారం'**తో గౌరవించుకునే అవకాశం రావడం నాకు దక్కిన మహద్భాగ్యం.

ఈ సమావేశాలు **'నభూతో న భవిష్యత్'** అన్న రీతిలో జరగడానికి నాతోపాటు రాత్రీ పగలూ శ్రమించిన మా **కార్యవర్గ సభ్యులందరికీ నా నమస్సులు.**

మీ సమయం, సహాయం, సహకారం నాటా పటిష్టతకు, ప్రతిష్టకి దోహదం చేశాయంటే అతిశయోక్తి కాదు.

**ఈ ఆనందోత్సాహానికి కారణభూతులైన**

## ఎందరో మహానుభావులు..
## అందరికీ వందనాలు.



మీ.. **డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కొర్సపాటి**
నాటా అధ్యక్షులు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com